




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 154 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శుక్రవారం - 24 - జులై - 2026 | వెల రూ. 5 /-




# డబుల్ ఓటు ఆరోపణలపై రేవంత్ రెడ్డి ఫైర్..!

- "దమ్ముంటే ఫిర్యాదు చేయండి" - ఓటు వివాదంపై సీఎం సవాల్
- ఓటర్ల జాబితా ప్రక్షాళన & పథకాలపై స్పష్టత
- హైడ్రా ప్రశంస - కాళేశ్వరం అవినీతిపై ఘాటు వ్యాఖ్యలు
- ఇంటర్ విద్యార్థుల మరణాలు - కేటీఆర్ క్షమాపణ చెప్పాలి!



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్‌ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పని తీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా .......

▸▸2

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం

- ప్రధాని మోదీ



- విద్యార్థుల భవిష్యత్తే అత్యంత ముఖ్యమన్న మోదీ
- పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- వేగవంతమైన విచారణ, కఠిన శిక్షలకు ఆదేశాలు
- విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయమన్న ప్రధాని

2

## డీఆర్‌డీఓ మరో ఘనత..

'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం



- విజయవంతంగా 'కుశ' క్షిపణి తొలి ప్రయోగం
- ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ
- సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం
- రక్షణ రంగంలో ఇదొక మైలురాయి అన్న రాజ్‌నాథ్ సింగ్
- విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వెల్లడి

2

## ఢిల్లీ పోలీసులకు ఎన్ఎస్ఏ అధికారాలు..

- సీజేపీ ఆందోళనల వేళ సర్వత్రా ఉత్కంఠ



▸▸2

## తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



- తెల్లవారుజామున తుపాకీతో కాల్చుకుని కానిస్టేబుల్ స్వామి ఆత్మహత్య
- తన భార్య, పిల్లలు చాలా మంచివాళ్లు అంటూ సూసైడ్ నోట్
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు

▸▸2

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం : మంత్రి పొన్నం



- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన

▸▸2

## పేద విద్యార్థిని చదువుకు మంత్రి కోమటిరెడ్డి రూ.10 లక్షల సాయం




- నల్గొండ జిల్లాకు చెందిన పరిమళకు ఆర్థిక సాయం
- ఐఐటీ మద్రాస్‌లో చదివి జర్మనీలో మాస్టర్స్ సీటు సాధించిన విద్యార్థిని
- కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా అందిన సహాయం

**నేటి శుభోదయ, నల్గొండ :** ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆకాంక్ష ఉన్నా, ఆర్థిక స్తోమత అడ్డంకిగా మారిన ఒక నిరుపేద విద్యార్థినికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అండగా నిలిచారు. జర్మనీలో ఉన్నత చదువుల కోసం ఎంపికైన సదరు విద్యార్థినికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన పరిమళ అనే విద్యార్థిని చిన్నప్పటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తోంది. ఐఐటీ మద్రాస్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె,

▸▸2

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్

- గ్లోబరీనా టెక్నాలజీస్‌పై చేసిన ఆరోపణలపై వివాదం
- 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.

## డబుల్ ఓటు ఆరోపణలపై
# రేవంత్ రెడ్డి ఫైర్..!

**మొదటిపేజీ తరువాయి..** గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

## ఢిల్లీ పోలీసులకు
# ఎన్ఎస్ఏ అధికారాలు..

**- సీజేపీ ఆందోళనల వేళ సర్వత్రా ఉత్కంఠ**

**మొదటిపేజీ తరువాయి..** నీట్ పరీక్షల అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనలు ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి. అయితే, ఇది ప్రతి మూడు నెలలకోసారి జరిగే సాధారణ పునరుద్ధరణ ప్రక్రియేనని, దీనికి కొనసాగుతున్న నిరసనలకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నెలలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. 2026 జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలల పాటు జాతీయ భద్రతా చట్టం-1980 కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ నిర్ణయంపై పలు మీడియా సంస్థలు భిన్న కథనాలు ప్రచురించాయి. సీజేపీ నిరసనలను అణచివేసేందుకే ఈ అధికారాలు ఇచ్చారని వార్తలు రావడంతో ఢిల్లీ పోలీసులు నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. "కొన్ని మీడియా సంస్థలు నివేదిస్తున్నట్లుగా, సీజేపీ నిరసనలను అణిచివేసేందుకు పోలీస్ కమీషనర్‌కు ఎన్ఎస్ఏ అధికారాలు ఇచ్చారనడంలో వాస్తవం లేదు. ఇది కేవలం రొటీన్ పరిపాలనా ప్రక్రియ. జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు అధికారాల పునరుద్ధరణ కోసం జులై 7వ తేదీనే ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీజేపీ నిరసనలు తీవ్రరూపం దాల్చడానికి ముందే ఈ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఎలాంటి అభ్యర్థన చేయలేదు. మీడియా ఈ ఉత్తర్వులను తప్పుగా అన్వయించుకుంది" అని ఢిల్లీ పోలీసులు తమ ప్రకటనలో వివరించారు.

# తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**మొదటిపేజీ తరువాయి..** హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. డీజీపీ ఆఫీసులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే కానిస్టేబుల్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పూట విధుల్లో ఉన్న స్వామి, ఉదయం దాదాపు 5.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లి తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. తీవ్ర గాయంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా భార్య, పిల్లలను ఎవరూ ఏమీ అనొద్దు.. వాళ్లు చాలా మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత దెయ్యంగా మారైనా సరే నా కుటుంబాన్ని, పిల్లలను జాగ్రత్తగా కాపాడుకుంటాను" అని ఆయన తన డైరీలో రాసుకున్న ఆఖరి మాటలు అందరినీ తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.

## పేద విద్యార్థిని చదువుకు మంత్రి
# కోమటిరెడ్డి రూ.10 లక్షల సాయం



**మొదటిపేజీ తరువాయి..** జర్మనీలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చేసేందుకు సీటు సాధించింది. అయితే, పరిమళ తల్లిదండ్రులు దినసరి కూలీలు కావడంతో విదేశీ విద్యకు అవసరమైన భారీ ఖర్చులను భరించడం వారికి భారంగా మారింది. ఈ విషయాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, తమ 'కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్' ద్వారా ఆ విద్యార్థినికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సకాలంలో అందిన ఈ సాయం తన విద్యా లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా పరిమళ మంత్రికి కృతజ్ఞతలు తెలియజేసింది.

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని వదిలిపెట్టం : ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. విద్యార్థుల సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే వారిపై వేగంగా, కఠినంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో.. పేపర్ లీక్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తై నిందితులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుందని, ఈ నిర్ణయం కూడా అందులో భాగమని మోదీ అన్నారు. యువత భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్‌మంతర్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# డీఆర్‌డీఓ మరో ఘనత..
## 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

**మొదటిపేజీ తరువాయి..** రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (LR-SAM) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (UAV), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. 'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇదీ దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. ప్రతి వర్షపు చుక్కనూ కాపాడుకుందాం : మంత్రి పొన్నం ప్రభాకర్

**మొదటిపేజీ తరువాయి..** ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# ఎస్ఐఆర్ ఫారంపై యువకుడి సూసైడ్ నోట్..
## నా చావుకు ప్రధాని మోదీయే కారణమంటూ నోట్!

**నేటి శుభోదయ, రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకున్న ఒక విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. 25 ఏళ్ల ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడుతూ, తన మృతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే కారణమంటూ సూసైడ్ నోట్ రాయడం సంచలనంగా మారింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వినియోగించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఫారమ్ పై అతను ఈ లేఖ రాయడం గమనార్హం. యల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పిట్ల వంశీ (25) గురువారం ఉదయం తన అద్దె నివాసంలో ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న వంశీ, పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి దినసరి కూలీ కాగా, ఆ కుటుంబం గత కొంత కాలంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించా రు. మృతుడు మద్యపానానికి బానిసైనట్లు తెలుస్తుండగా, అతని ఆత్మహత్యకు దారి తీసిన కచ్చితమైన కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# నీట్ నిరసనలు: అల్లర్ల నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దు యోచనలో ఢిల్లీ పోలీసులు

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** నీట్-యూజీ 2026 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, దాడులకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితుల పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అంశాన్ని ఢిల్లీ పోలీసులు తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచా రం. 'చలో సంసద్' పిలుపులో భాగంగా నిరసనకారులు పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ కేసుల్లో అరెస్టయిన కీలక నిందితులు విచారణ దశలో దేశం విడిచి పరారయ్యే అవకాశం ఉందని భావిస్తున్న అధికారులు, ముందస్తు జాగ్రత్త చర్యగా వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేయించాలని యోచిస్తున్నారు. సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను చేపట్టాలని పోలీసులు భావిస్తున్నారు. గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, పరీక్షల నిర్వహణ విధానంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలు అధిక భాగం శాంతియుతంగానే సాగినప్పటికీ, కొన్ని చోట్ల రాళ్ల దాడి, పోలీసు వలయాలను ఛేదించే ప్రయత్నాలు జరగడంతో ఇరుపక్షాలకు చెందిన పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు ఇప్పటికే పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, పాస్‌పోర్ట్‌ల రద్దుపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం ఈ అంశం సమీక్ష దశలోనే ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## ఆగస్టు 3తో ముగియనున్న ప్రత్యేక ఓటరు జాబితా

**బోనకల్, జూలై 23,నేటి శుభోదయ :** బోనకల్ గ్రామ ప్రజలందరూ ప్రస్తుతం కొన సాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివరాల నమోదు ప్రక్రియను గడువులోపు పూర్తి చేసు కోవాలని బోనకల్ గ్రామ ఉప సర్పంచ్ బానోత్ కొండ విజ్ఞప్తి చేశారు.ఆయన మాట్లాడుతూ, వివరాల నమోదు ప్రక్రియ ఆగస్టు 3వ తేదీతో ముగియనున్నందున, ఇప్పటివరకు తమ వివరాల నమోదు పత్రాలను సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి వాటిని పూర్తి చేసి సమర్పించాలని కోరారు.ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం లేదా ఇతర కారణాల వల్ల హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాలు లేదా గ్రామాల్లో నివ సిస్తున్న బోనకల్ గ్రామానికి చెందిన వారు ఈ విషయాన్ని తప్పకుండా గమనించాలని సూచించారు. విలువైన ఓటు హక్కును కాపాడుకోవాలంటే గడువు ముగిసేలోపు తప్పనిసరిగా వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామానికి చెందిన ఇతరులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి, ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని ఉప సర్పంచ్ బానోత్ కొండ కోరారు.




## నీట్ పేపర్ లీకేజ్‌పై కేంద్రం సమాధానం చెప్పాలి

**మిడ్జిల్, జూలై 23, నేటి శుభోదయ :** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ టిపిసిసి పిలుపుమేరకు, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి గారి ఆదేశాల మేరకు మిడ్జిల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు మండల కేంద్రంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయి నాయకులు, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నాయకులు మాట్లాడుతూ, ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజ్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీమతి ప్రియాంక గాంధీ గారు, విద్యార్థులు, యువతపై పోలీసులు అరెస్టులు చేయడం, లాఠీచార్జ్‌కు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా ఖండించారు.నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాలని కోరారు.నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాల పేరుతో హామీలు ఇచ్చి, పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యంతో వారి భవిష్యత్తును నాశనం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శిం చారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని





స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ సర్పంచులు, సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ సభ ను జయప్రదం చేయండి

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** కవి, రచయిత, కళాకారుడు, ఉద్యమ నేత కోమాకుల సీతారాములు రచించిన "హాస్టల్ కతలు " పుస్తకావిష్కరణ కార్యక్రమం జులై నెల 26 న ఉదయం, 10. గంటలకు నిర్వహిస్తున్నట్లు బహుజన సాహిత్య వేదిక ప్రకటించింది. హాస్టల్ కథలు పుస్తకావిష్కరణ కార్యక్రమం బ్రోచర్ ను భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం ఆవిష్కరిం చారు. భక్త రామదాసు కళా క్షేత్రం ఖమ్మం లో నిర్వహిచే ఈ కార్య క్రమానికి ప్రముఖ కవి, రచయిత, ఎ. విద్యా సాగర్, ఐ.ఎ.ఎస్, మరో రచయిత భంగ్య భూక్య హాజరు కానున్నారని తెలిపారు. కాళోజి అవార్డు గ్రహీత ప్రముఖ కవి, రచయిత ఆర్. సీతారాం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం లో ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు, గాయకులు, గద్దర్ అవార్డు గ్రహీత భీమ్స్ సిసిరోలియో ను ఘనంగా సన్మానించునున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, గేజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, కవి, రచయిత అమ్మిన శ్రీనివాస రాజు పాల్గొనబోతున్నట్లు తెలిపారు.మొగిలి వెంకటేశ్వర్లు సమన్వయ కర్త గా వ్యవహరించే ఈ కార్యక్రమం లో కవి, రచయిత, రాచమళ్ళ ఉపేందర్ పుస్తక సమీక్ష చేయనున్నారు. అనేక సాహితీ సంఘాల, ఉద్యగ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొనే ఈ కార్యక్రమంలో కోమాకుల సీతా రాములు దంపతుల సప్తతి ని కూడా నిర్వహించనున్నట్లు బహుజన సాహిత్య వేదిక బాధ్యులు సయ్యద్ ఖుర్షీద్, మద్దెర్ల రమేష్, కోమిరె వెంకన్న, పమ్మి రవి, మావూరి మల్లేశం, బి. ఎల్. వెంకన్న, వజ్రం నాగేశ్వర్ రావు, పంజాల ఐలయ్య ప్రకటించారు.ఈ కార్యక్రమం లో ఉద్యోగ, ఉపాధ్యాయ, సాహితీ సంఘాల బాధ్యులు, ఆలూచనా పరులు, రచయిత లు, కవులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## త్రాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట కార్యాచరణ

### : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** రాష్ట్రంలో నెలకొన్న 'ఎల్ నినో' తీవ్ర వాతావరణ పరిస్థితుల వల్ల ఖమ్మం జిల్లా ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కొకుండా పటిష్ట కార్యా చరణ చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ దిశగా ప్రజా ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేసింది. జిల్లావాసులకు ఎలాంటి తాగు నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని గత సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి అధికారు లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు యంత్రాంగం వేగంగా స్పందించి చర్యలు చేపట్టింది.వేగంగా నీటి తరలింపుభద్రాచలం వద్ద ఉన్న దుమ్ముగూడెం నుంచి రాజీవ్ కాలువ ద్వారా గోదావరి వెనుక జలాలను నాగార్జునసాగర్ (ఎన్ఎస్ పి) మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా నేరుగా వైరా చెరువుకు తరలిస్తున్నారు.--- క్షేత్రస్థాయిలో డిప్యూటీ సీఎం పరిశీలన గురువారం ఎన్ఎస్పీ మెయిన్ బ్రాంచ్ కాలువకు వేగంగా వస్తున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీటి ప్రవాహాన్ని, తరలింపు ప్రక్రియను సమీక్షించిన ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువులను ఈ గోదావరి జలాలతో త్వరితగతిన నింపాలని ఆదేశించారు.--- నీటి ఎద్దడికి తావులేకుండా జాగ్రత్తలు ఎల్ నినో ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, జిల్లాలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవే క్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.--- ప్రజలకు ఊరట ఎల్ నినో ముప్పు పొంచి ఉన్న వేళ, సాగర్ మెయిన్ బ్రాంచ్ ద్వారా గోదావరి జలాలు వైరా చెరువుకు చేరుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లయింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఇరిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఇ శ్రీనివాస చారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.







## జాతీయ పతాకాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత : కడవెండి శ్రీనివాస్



**ఖమ్మం, జూలై 23,నేటి శుభోదయ :** జాతీయ పతాక ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ శివాలయం స్ట్రీట్ ఆధ్వర్యంలో మారెమల్ల రామకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్, డైమండ్ స్టార్ కేసిజిఎఫ్ కడవెండి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకం దేశ గౌరవానికి ప్రతీక అని, ప్రతి భారతీయుడు దానిని గౌరవించడం తన బాధ్యతగా భావించాలని అన్నారు. "జెండాను గౌరవిద్దాం, దేశాన్ని బాధ్యతతో ముందుకు తీసుకెళ్దాం" అనే సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఐపీసీ కొదుమూరి జగన్నాధం, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, సేవారత్న అవార్డు గ్రహీత వివిన్ సిల్వర్ కేసిజిఎఫ్ కడవెండి విశ్వనాథ్ గుప్తా, ఆర్సీ దాస శ్రీనివాసరావు, శివాలయం స్ట్రీట్ కార్యదర్శి గోపాలకృష్ణమూర్తి, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు, సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు

## నీట్ పేపర్ లీక్‌పై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన గడ్డం అనన్య



**వికారాబాద్ , జూలై 23, నేటి శుభోదయ :** వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నీట్ పేపర్ లీకేజీ, ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి, రాహుల్ గాంధీ అరెస్టుకు వ్యతిరే కంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గడ్డం అనన్య మాట్లాడుతూ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్ష కోసం విద్యార్థులు ఎన్నో నెలల పాటు తీవ్రంగా శ్రమిస్తారని, తల్లిదండ్రులు భారీగా ఖర్చు చేసి తమ పిల్లల భవిష్య త్తుపై ఆశలు పెట్టుకుంటారని అన్నారు. అలాంటి పరీక్షలో పేపర్ లీక్ జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటన కారణంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. బాధిత విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## రవీంద్ర భారతిలో జులై 26న పోతురాజు కు సత్కారం





**సత్తుపల్లి,జూలై 23, నేటి శుభోదయ** ఈనెల 26న హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో సత్కారం పొందను న్నారు. తెలుగు సాహితీ వనం సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సత్కారం జర గనుంది. ఈ సంస్థ బాల సాహిత్య విభాగంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవుల పుస్తకాలను బహుమతి ఎంపిక నిమిత్తం సేకరించింది. అధిక సంఖ్యలో వచ్చిన బాల సాహిత్య రచనలలో ప్రథమ బహుమతికి వడ్డేపల్లి వెంకటేష్ ఎంపిక కాగా ప్రోత్సాహక బహుమతికి ఆవుల పోతురాజు ఎంపికయ్యారు. పోతురాజు నేపథ్యం తెలుసుకుని బహుమతికి ఎంపిక నిమిత్తం సేకరించిన పుస్తకాలలో రచయిత ప్రతిభా స్థాయిని గుర్తించి ఎంపిక చేసారు.రచనతో పాటు పోతురాజు కుటుంబ నేపథ్యం కూడా ప్రోత్సహక బహుమతికి ఒక కారణమయింది. సంచార జాతుల కుటుంబానికి చెందిన ఆవుల పోతురాజు గుడారంలో నివసిస్తూ చదువుతో పాటు తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించడం తెలుగు సాహితీ వనం నిర్వాహకులు శాంతికృష్ణను స్పందింప చేసింది. ఆదివారం రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో ఎం.ఎల్.ఎస్.స్నిగ్ధారెడ్డి సాహిత్య పురస్కారాన్ని తెలుగు సాహితీ వనం వార్షికోత్సవ వేడుక వేదికగా ఆవుల పోతురాజు అందుకోనున్నారు. --- నా ప్రతిభకు మెరుగులు దిద్ది ప్రోత్సహిం చారు : ఆవుల పోతురాజు రవీంద్రభారతిలో బాల సాహిత్య సత్కారానికి వెళుతు న్నాను. సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకుని ప్రస్తుతం గంగారం సాయిస్ఫూర్తిలో ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతు న్నాను.నాలోని రచనా ప్రతిభను గుర్తించిన తెలుగు మేడమ్ రమాదేవికి, పుస్తక ప్రచురణ చేసిన "గార్లపాటి–బొల్లేపల్లి" ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ మధుసూదన రాజు లకు,పుస్తకాన్ని ఆవిష్కరించిన సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే సోందు లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

# వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి




**బోనకల్, జూలై 23,నేటి శుభోదయ :** వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం ఉండే పంటల సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ సూచించారు. గ్రామంలో నిర్వహించిన ఎల్ఎన్వో సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు పరిస్థితులను అంచనా వేసుకుని పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులు తమ పొలాల్లో వ్యవసాయ నీటి నిల్వ గుంటలను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి వనరులను కాపాడేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, వ్యవసాయ శాఖ అధికారి బంధం రజిత, మంచినీటి శాఖ అధికారి పవన్ కుమార్, నీటిపారుదల శాఖ అధికారి ఏడుకొండలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారి కృష్ణకుమారి, విద్యుత్ శాఖ లైన్‌మన్ సీతయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండపనేని సుధాకర్‌రావు, గ్రామ శాఖ కార్యదర్శి తెల్లూరి రమేష్, గ్రామ పెద్దలు, రైతులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మొర్లా శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించి , ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ



**బోనకల్, జూలై 23,నేటి శుభోదయ :** ఇటీవల మృతి చెందిన మొర్లా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, గ్రామ సర్పంచ్ జ్యోతి, మాజీ సహకార సంఘం అధ్యక్షులు కొండపైన సుధాకర్ రావు పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీనివాసరావు అందరితో కలిసి మెలిసి ఉండే మంచి వ్యక్తి అని, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా గ్రామ ప్రజలతో ఆప్యాయంగా మెలిగేవారని అన్నారు. ఆయన అకాల మరణం గ్రామానికి, కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు శ్రీనివాసరావు ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో అంతటి శ్రీను, మహేశ్వరరావు, షేక్ బాజీ మరియు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, స్థానికులు పాల్గొని శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.

# ఆరుతడి పంటల సాగు పై రైతులు దృష్టి సారించాలి



**నేలకొండపల్లి , జూలై 23,నేటి శుభోదయ :** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కట్టుకాసారం క్లస్టర్ అధికారి బి. శిరీష సూచించారు. గురువారం నేలకొండపల్లి మండలంలోని కట్టుకాసారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సైదయ్య అధ్యక్షతన వర్షాభావ పరిస్థితులు, ప్రత్యమ్నాయ పంటలు అనే అంశంపై గ్రామ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న, మిరప వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించవచ్చని తెలిపారు. రైతులు వరి సాగు చేసి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జాతి భవితపై 'రాజకీయ' రాబందుల వాలకం

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్య దేశంలో తమ హక్కుల కోసం, తమ భవిష్యత్తు కోసం నిరసన తెలిపే స్వేచ్ఛ ప్రతి పౌరుడికీ, ప్రతి విద్యార్థికీ ఉంటుంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలకు, వారి కలలకు సంబంధించిన అత్యంత సున్నితమైన అంశం. ఇలాంటి సమయంలో విద్యార్థులకు అండగా నిలవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి వ్యవస్థపైనా ఉంటుంది. కానీ, సరిగ్గా ఇదే ఆవేదనను ఆసరాగా చేసుకుని, అమాయక విద్యార్థుల భుజాలపై తుపాకులు పెట్టి దేశ సార్వభౌమాధికారాన్ని సవాల్ చేసే కుట్ర ఢిల్లీ వీధుల్లో బట్టబయలైంది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో మొదలైన ఈ ఆందోళనలు, దానికి కొన్ని ప్రధాన ప్రతిపక్షాలు ఇస్తున్న మద్దతు వెనుక, జాతి పునాదులను కదిలించే ఒక అదృశ్య హస్తం పనిచేస్తోందన్న వాదనలు ఇప్పుడు దేశభక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.--- అసలు లక్ష్యం విద్యార్థుల న్యాయమా? లేక దేశ అస్థిరతా?కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ప్రారంభమైన ఈ నిరసన క్రమంగా తన రూపు మార్చుకుంది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనల్లో ఎవరెవరో వేదికనెక్కడం, విద్యార్థుల సమస్యను గాలికి వదిలేసి మతం, రాజకీయం, విద్వేషాల చుట్టూ ప్రసంగాలు చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసలు వైద్య విద్యకు సంబంధించిన నీట్ పరీక్షకు, రామ మందిరానికి, హిందూ ధర్మానికి ముడిపెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? కొందరు వివాదాస్పద వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే శ్రీరాముడిని, సీతమ్మను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం వెనుక ఉన్న కుట్ర ఏమిటి? శాంతియుతంగా జరగాల్సిన ఒక విద్యాసంబంధిత ఉద్యమాన్ని ఉద్దేశపూర్వకంగానే మతపరమైన విద్వేషాల వైపు మళ్లించి, తద్వారా దేశంలో అశాంతిని రగిల్చాలనే ఎజెండా ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.--- ఆందోళనకారుల ముసుగులో విద్రోహ శక్తుల చొరబాటునిరసన పేరుతో రాజధాని నడిబొడ్డున కొందరు సృష్టించిన బీభత్సం చట్టాన్ని, రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేసింది. సోమవారం పార్లమెంట్ వైపు దూసుకెళ్లిన ఆందోళనకారులు విధుల్లో ఉన్న పోలీసులపై, వార్తలు సేకరిస్తున్న జర్నలిస్టులపై దాడులకు తెగబడటం, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం వారి అసలు రంగును బయటపెట్టింది. అంతకుమించి, జిహాద్ పేరుతో నినాదాలు చేయడం, ఏకంగా భారత సైన్యాన్ని దూషించడం, ప్రధాని మాతృమూర్తిని అత్యంత జుగుప్సాకరంగా కించపరచడం వంటి పరిణామాలు ఒక నాగరిక సమాజం తలదించుకునేలా చేశాయి. ఈశాన్య రాష్ట్రాలను దేశం నుంచి విడదీస్తామని కుట్రలు పన్నినందుకు యూఏపీఏ చట్టం కింద అరెస్టయిన షర్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్‌లను విడుదల చేయాలని ఈ వేదికపై నుంచి డిమాండ్ చేయడం అత్యంత విస్మయకరం. అలాగే, కాశ్మీర్‌లో మళ్లీ ఆర్టికల్ 370ని తీసుకురావాలని డిమాండ్ చేయడం చూస్తుంటే ఈ ఉద్యమాన్ని నడిపిస్తున్నది విద్యార్థులు కారని, దేశాన్ని ముక్కలు చేయాలని కలలు కనే విచ్ఛిన్నకర శక్తులని ఇట్టే అర్థమవుతోంది.--- జాతి గమనించాల్సిన నగ్న సత్యం ఒక పక్క తమ పవిత్రమైన ఉద్యమంలోకి హింసాత్మక శక్తులు చొరబడ్డాయని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఎవరిని ఉద్ధరించడానికి ఈ శక్తులు అమాయక విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయో జాతి మొత్తం గ్రహించాల్సిన అవసరం ఉంది.--- అరాచకానికి తావులేదన్న అత్యున్నత న్యాయస్థానం ఈ దేశంలో చట్టం, న్యాయం తమ పని తాము చేసుకుపోతాయని సుప్రీంకోర్టు మరోసారి కుండబద్దలు కొట్టింది. పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ, తమను తాము బాధితులుగా చిత్రీకరించుకునే ప్రయత్నం చేసిన అల్లరిమూకలకు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని ధర్మాసనం చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి, వీడియోలు చూడాలన్న న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చుతూ ఆ వీడియోలు చూసే సమయం, ఆసక్తి తమకు లేవని తేల్చి చెప్పడం న్యాయవ్యవస్థ నిబద్ధతను తెలియజేస్తోంది. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, ఆపై కోర్టుల ద్వారా రక్షణ పొందాలనుకునే వారికి ఈ పరిణామం ఒక స్పష్టమైన హెచ్చరిక. అంతకుముందు ఢిల్లీ హైకోర్టు సైతం ఈ వ్యవహారంలో కోర్టులను లాగవద్దని స్పష్టం చేయడం ద్వారా, దేశ భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని న్యాయస్థానాలు చాటిచెప్పాయి.--- సాంకేతికతతో ఉక్కుపాదం, చట్టం వలయంలో దోషులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఢిల్లీ పోలీసులు తమ చర్యల ద్వారా నిరూపిస్తున్నారు. విద్యార్థుల ముసుగులో హింసకు పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే ఐదు ప్రధాన పోలీస్ స్టేషన్ల (సంసద్ మార్గ్, కన్నాట్ ప్లేస్, మందిర్ మార్గ్, బరాఖంబ రోడ్, కర్తవ్య పాత్) పరిధిలో పదికి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడం పోలీసుల చిత్తశుద్ధికి నిదర్శనం. ఆధునిక సాంకేతికతను ఆయుధంగా మలచుకున్న దర్యాప్తు సంస్థలు, వందలాది సీసీటీవీ ఫుటేజీలు, డ్రోన్ కెమెరాలు, పోలీసుల బాడీ క్యామ్స్ రికార్డింగ్స్ ఆధారంగా అల్లరిమూకలను జల్లెడ పడుతున్నాయి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ముసుగులు ధరించిన నిందితులను సైతం గుర్తిస్తున్నారు. ఈ దాడుల వెనుక ఏదైనా వ్యవస్థీకృత కుట్ర ఉందా? విదేశీ నిధులు ఏమైనా అందాయా? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుగుతోంది. ఇది కేవలం ఢిల్లీ వీధుల్లో జరిగిన అల్లర్లకే పరిమితం కాకుండా, దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన విషయంగా పరిగణించి పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.--- మన దేశం, మన బాధ్యత నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. వారి కలలు సాకారం కావాలి, వారి సమస్యలు పరిష్కారం కావాలి. కానీ, ఆ సమస్యల ముసుగులో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసే శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. రాజకీయ స్వలాభం కోసం అమాయక విద్యార్థులను పావులుగా వాడుకునే కుట్రలను ప్రతి పౌరుడూ ఖండించాలి. దేశ సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తూ, జాతి ఐక్యతకు తూట్లు పొడవాలని చూసే అదృశ్య హస్తాలను గుర్తించి సమాజం నుంచి వెలివేయాలి. చట్టం తన పని తాను చేస్తున్నప్పుడు, దానికి సమాజం అండగా నిలవాలి. మనమంతా ఒక్కటే.. ఈ దేశం మనది అన్న భావన ప్రతి భారతీయుడి గుండెల్లో మళ్లీ రగులుకోవాల్సిన తరుణమిది.

# కదం తొక్కిన విద్యార్థి లోకం

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** ప్రభుత్వం విద్యార్థుల బోధనా రుసుములు, ఉపకార వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలని వందలాది మంది విద్యార్థులతోని కలెక్టరేట్ ను ముట్టడించిన విద్యార్థులు విద్యార్థి సంఘాల నాయకులు.అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ఈ ధర్నాకు అధ్యక్షతన వహించారు. ధర్నాను ఉద్దేశించిఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్లగా ఫీజు రియంబర్స్మెంట్, ఉపకార వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదని, ప్రభుత్వం మారిన, పాలన మాత్రం అలానే ఉందని,విద్యార్థు పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేదని అయన పేర్కొన్నారు. మొత్తం బకాయిలు ఉండడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పలుమార్లునిర్వదిక బంద్ నిర్వహించిన ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందనలేదని అయన విమర్శించారు.ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. ఐదే ఏళ్లుగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందన్నారు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువ శాతం ఫీజు రీయింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్నారన్నారని, గత ఐదేళ్లగా లక్షల సంఖ్యలో బీటెక్




డిగ్రీ విద్య వైద్యం ప్రొఫెషనల్ కోర్సులు కొనసాగిస్తున్నారని అన్నారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులు చదివే ఇంజనీరింగ్ కళాశాల కు పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు ఈబిసి, మైనార్టీ ఒక్కొక్క విద్యార్థికి 35000 ఫీజు రియంబర్స్మెంట్ అందించాల్సిన అవసరం ఉందన్నారు డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్క విద్యార్థికి సుమారుగా 18000 నుంచి 35 వరకు అందించాల్సి అవసరం ఉందన్నారు.ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందని, అన్నారు.మొత్తం 10,300 వేల కోట్ల రూపాయలు పెండింగ్ బకాయిలు ఉండడంతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పిజు,రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని, అన్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు షేక్ నాగుల మేర బుర్ర మనోజ్, జిల్లా నాయకులు సాయి, పవన్ ,అభిరామ్ వరుణ్, నాగ శేషు, గోపి, నరేందర్, సుకుమార్, వెంకటేష్, మహేశ్వరి ,పావని, గీత, సరస్వతి మౌనిక. రమ్య తదితరులు పాల్గొన్నారు.

# 46వ డివిజన్లో సి ఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఖమ్మం, జూలై 23,నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారం స్థానిక 46 డివిజన్లో లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పూనుకొల్లు నీరజ, సర్ ఖమ్మం నియోజకవర్గ ఇన్చార్జి కమర్తపు మురళి, ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రం బాలగంగాధర్ తిలక్ తో కలిసి మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ , స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులైన వనమా మంగమ్మ కి రూ 47,000/- నిమ్మల భానుమతి కి రూ 39,500/-, నక్కా హైమావతి కి రూ 60,000/- , గుమ్మల నాగలక్ష్మి కి రూ 27,000/-, సింగరాజు శైలజ కి రూ 18,500/- , మోటె ముత్తమ్మ కి రూ 60,000/- మొత్తం కలిపి రూ 2,52,000/- వారి ఇళ్లకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య కారణాల వలన ప్రైవేట్ ఆసుపత్రి నందు చికిత్స పొందిన వారికి ఆర్థిక సహాయంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వారికి చెక్కులు అందజేయడం జరిగిందని వారు తెలిపారు. పేద ప్రజలకు నిజంగా సి ఎం ఆర్ఎఫ్ ఒక వరం లాంటిదని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి ఒక తోడుగా ఈ కార్యక్రమం నిలుస్తుందని తెలిపారు. ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం కొనసాగుతుందని



తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జి, నగర ఓబిసి అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, నగర కాంగ్రెస్ కార్యదర్శి దేవర వెంకన్న, నాయకులు దయ్యాల నాగేశ్వరరావు, బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేష్, గోనెల రవిశంకర్,ఎమ్మే రామకృష్ణ, చల్లా రమేష్, మన్నె హరికృష్ణ, చల్లా సైదులు, మీర్జా అజీజుల్లా బేగ్, సెల్వం జ్ఞానేశ్వర్, వట్టికూటి వీర ప్రసాద్, సింగరాజు వెంకన్న, షేక్ మొయిన్, గోనెల సునీత, జిల్లేపల్లి సులోచన ,విజయలక్ష్మి , మల్యాల బిక్షపతి, నక్క నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.నందించారు.

## ఢిల్లీలో ఉద్యమిస్తున్న యువతపై మోడీ నియంతృత్వ వైఖరిని ఖండించండి

**నిజామాబాద్ రూరల్ సిరికొండ , జూలై 23,నేటి శుభోదయ :**
ఢిల్లీలో ఆందోళన చేస్తున్న యువత విద్యార్థులకు మద్దతుగా సిరికొండలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రదర్శన మానవ హారం ఢిల్లీలో ఉద్యమిస్తున్న యువతపై మోడీ నియంతృత్వ వైఖరిని ఖండించాలని.యువత, విద్యార్థులపై ఢిల్లీ పోలీస్ ల అమానుష హింసను ఖండించాలని, హింసకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ,విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనిసిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి, జిల్లా నాయకులు ఆర్ రమేష్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న యువత విద్యార్థులకు మద్దతుగా సిరికొండలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ సిరికొండ, ధర్పల్లి సంయుక్త మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తా లో ప్రదర్శన మానవహారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆందోళన కారులను ఉద్దేశించి సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి, జిల్లా నాయకులు ఆర్ రమేష్ మాట్లాడుతు ఈ దేశ భవిష్యత్తు కోసం, ముఖ్యంగా విద్యా వ్యవస్థలో పోయిన మార్పులు తీసుకురావాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న యువతరం, విద్యార్థులు దేశ ప్రజలకు ఆదర్శనీయమన్నారు. నీట్ పరీక్షల లీకేజీలపై ప్రధానంగా యువతరం విద్యార్థులు 23 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వివరిస్తుందన్నారు. అసమర్థ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని , నీటి పరీక్షల లీకేజ్ ప్రధాన దోషులైన వారిని శిక్షించాలని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపలేరు అందించాలని ప్రధానమైన డిమాండ్స్ తో ఉద్యమిస్తుంటే నియంత ప్రధానమంత్రి మోడీ ఏ మాత్రం స్పందించకుండా మొద్దు నిద్రపోతున్నారన్నారు. సైంటిస్ట్, సామజికవేత్త సోనమ్ వాంగ్ చుక్ నిరాహార దీక్ష చేస్తున్న ఏ మాత్రమూ స్పందించకుండా దుర్మార్గంగా అరెస్టు చేసి అరెస్టు చేశారన్నారు. దీనితో ఆగ్రహించిన విద్యార్థులు యువతరం పెద్ద ఎత్తున ఢిల్లీని చుట్టూ ముట్టారన్నారు. శాంతియుతంగా గాంధేయ మార్గంలో ఆందోళన చేస్తున్న యువతరం విద్యార్థులపై ప్రభుత్వం పోలీసులు ప్రేరేపించి లాటి చార్జీ బాసవాయిలు తూటాలు ఉపయోగించి విద్యార్థులను ఒక గాయాలు చేశారన్నారు. విద్యార్థిలను సైతం వదిలిపెట్టకుండా ప్లాట్లతో చావగొట్టి వాళ్ళ నేర ప్రవృత్తిని బయట పెట్టుకున్నరన్నారు. ఇప్పుడు దేశ ప్రజల ప్రధాన డిమాండ్ విద్యామంత్రి కాదు ప్రధాన మంత్రి సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఒక్క ఢిల్లీ కాదు అనేక ప్రధానమైన పట్టణాల్లో యువతరం విద్యార్థులు ఆందోళనకు దిగి ప్రభుత్వం వ్యతిరేకంగా పోరాడుతున్నారన్నారు. యువతరం స్ఫూర్తిని తీసుకొని దేశ



ప్రజలందరూ ఐక్యంగా పోరాటం చేసి కేంద్ర ప్రధానమంత్రి మోడీని గద్దతించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉద్యమంలో ప్రాణాలు విడిచిన విద్యార్థినికి నివాళులర్పించి ఆమె మరణం బాధకరం అని, మన ఉద్యమానికి ఆ విద్యార్థిని ఇచ్చిన స్ఫూర్తితో ఆమె బాటలు అందరూ యువతరం పోరాటం చేయాలని గెలిచే వరకు నిలబడాలని ఆయన విజ్ఞప్తి చేశారు కార్యక్రమం లో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్★ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, బి కిషోర్, ఎం సాయిరెడ్డి, మండల నాయకులు ఎస్ కిషోర్, జే రాజు, ఎం పండరి, ఎన్ చిన్న రాజన్న, గ్యామ గంగారాం, తదితరులతో పాటు విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు..

## ఏలినో పై అవగాహన సదస్సు నిర్వహణ



**చింతకాని, జూలై 23, నేటి శుభోదయ :**
చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏలినో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమారాణి, వ్యవసాయ విస్తరణ అధికారి కార్తీక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏలినో ప్రభావం కారణంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో భూగర్భ జలాల మట్టం తగ్గిపోయే ప్రమాదం ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా బోరు నీటిపై ఆధారపడే వరి పంటతో పాటు చెరువుల కింద ఉన్న పొలాల్లో కూడా వరి సాగు చేయవద్దని రైతులకు సూచించారు. అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా పెసర, మినుము, కంది, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని కోరారు. ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేస్తే పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో బండి రామారావు, బండి యాకోబు, గోదా ప్రసాదు, గోదా రాధమ్మ, గోదా శీను, చింతల రామారావు, మడిపల్లి మంగరావు,రైతులు, గ్రామస్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి మాటల్లోనే... సమస్యల వలయంలో వికారాబాద్ పట్టణం

**వికారాబాద్, జూలై 23,నేటి శుభోదయ :**
వికారాబాద్రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందాల్సిన వికారాబాద్ పట్టణం నేడు మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అనంతగిరి అటవీ ప్రాంతం, ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటక అవకాశాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ పట్టణం ప్రస్తుతం అధ్వాన్న రహదారులు, మురుగు కాల్వల సమస్యలు, ట్రాఫిక్ అవ్యవస్థ, రైల్వే గేట్ల వద్ద నిత్య ఇబ్బందులు, ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాల లేమితో ప్రజల అసంతృప్తికి కేంద్రబిందువుగా మారింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన అభివృద్ధి హామీలు ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో "అభివృద్ధి మాటల్లోనే మిగిలిపోయిందా?" అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తమవుతోంది.పట్టణంలోని ప్రధాన రహదారుల పరిసితి రోజురోజుకూ దిగజారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు పూర్తిగా నీటమునిగిపోతూ చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీటితో పాటు మురుగు కాల్వల నీరు కూడా రోడ్లపైకి చేరి బురదమయంగా మారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు నీటితో నిండిపోవడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం పెరుగుతుండగా, ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పట్టణంలోని మురుగు కాల్వల వ్యవస్థ కూడా పూర్తిగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. ఎప్పుడు మోరీలు పొంగిపోతాయో తెలియని పరిసితి నెలకొనడంతో మురుగు నీరు వీధుల్లోకి ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన కూడళ్లతో పాటు నివాస ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడిన ప్రతిసారి మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి అధికారులు సమగ్ర చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.వికారాబాద్ చుట్టుప







క్కల ఉన్న రైల్వే గేట్లు కూడా ప్రజలకు నిత్య సమస్యగా మారాయి. రైళ్లు వెళ్లే సమయంలో గేట్లు ఎక్కువసేపు మూసివేయబడటంతో వాహనాలు బారీగా నిలిచిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రికి వెళ్లే రోగులు, గర్భిణీలు, ప్రమాద బాధితులు, అంబులెన్సులు కూడా రైల్వే గేట్ల వద్దే నిలిచిపోవాల్సి వస్తోంది. ఈ ఆలస్యం కారణంగా ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు రైల్వే గేట్ల సమస్య మరింత భారంగా మారిందని అభిప్రాయ పడుతున్నారు.ట్రాఫిక్ పరంగా కూడా పట్టణ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు డివైడర్లు లేకపోవడం, ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ఏ దిశ నుంచి వాహనం వస్తుందో అర్థం కాక తరచూ ప్రమాదాలు తప్పడం లేదని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్ ప్రాంతాలకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ జామ్‌లు సాధారణంగా మారాయి. ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని అంటున్నారు.పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ పట్టణానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇచ్చే నాయకులు ఎన్నికల తర్వాత ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని, అధికారులు కూడా సమస్యలను ప్రత్యక్షంగా గమనిస్తున్నప్పటికీ పరిష్కారానికి చొరవ చూపడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.వికారాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా రహదారుల అభివృద్ధి, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ నియంత్రణ, రైల్వే గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పన వంటి కీలక అంశాల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. అభివృద్ధి అంటే కేవలం శంకుస్థాపనలు, ప్రకటనలు మాత్రమే కాకుండా ప్రజలకు నిత్య జీవితంలో ఉపయోగపడే మౌలిక సదుపాయాలను కల్పించడమేనని వారు గుర్తుచేస్తున్నారు.ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రయాణ సౌకర్యం, పర్యాటక అభివృద్ధి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే కార్యాచరణ రూపొందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్ల మరమ్మతులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటు, డివైడర్ల నిర్మాణం, రైల్వే గేట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల విస్తరణ వంటి చర్యలు చేపట్టినప్పుడే వికారాబాద్ నిజమైన అభివృద్ధి పట్టణంగా రూపుదిద్దుకుంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజలందరి నోట ఒకటే మాట వినిపిస్తోంది... "అభివృద్ధి మాటల్లో కాదు... చేతల్లో కనిపించాలి."

## కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీ వరంగల్ క్రాస్ రోడ్ ఖమ్మంలో మెడికల్ క్యాంపు



**ఖమ్మం, జూలై 23,నేటి శుభోదయ :**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ప్రవీణ ఆదేశానుసారంగా జిల్లాలోని కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీ వరంగల్ క్రాస్ రోడ్ ఖమ్మం లో గురువారం క్లినిక్ ఏర్పాటు చేయడం జరిగింది. అంగవైకల్యం కలిగిన కుష్టు వ్యాధిగ్రస్తులకు ఈరోజు చికిత్సలో భాగంగా 30 వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ చేతుల మీదుగా అంగవైకల్యం కలిగిన కుష్టి వ్యాధిగ్రస్తులకు ఎం సి ఆర్ చెప్పులు బ్యాండేజ్, కాటన్,పుండ్లకు సంబంధించిన ఆయింట్మెంట్లు, సపోర్ట్ డ్రగ్స్ పంపిణీ చేయడం జరిగింది. వ్యాధిగ్రస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వ్యాధి పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపకుండా జాగ్రత్తలు పాటించి అవగాహన కలిగి ఉండాలని తెలియచేశారు. కుష్టి వ్యాధిగ్రస్తులు వ్యాధికి సంబంధించిన శరీరంపై మచ్చలు ఏర్పడినప్పుడే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి చూపించుకొని అది కుష్టి వ్యాధి గా నిర్ధారణ అయినట్లయితే ప్రాథమిక దశలోనే మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునని అలా కాకుండా అశ్రద్ధ చేసినట్లయితే అంగవైకల్యానికి దారితీయునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీ.ఎం.ఓ మల్లయ్య, ఫిజియోథెరపిస్టు భద్రు, నోడల్ పర్సన్ సుధాకర్, ఆశా కార్యకర్త పాల్గొనడం జరిగింది.

## 26 న ఎస్టీయు 80 వసంతాల వేడుకలు

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :**
దేశానికి స్వాతంత్ర్యం రాక ముందే ఉపాధ్యాయ హక్కుల కోసం ఏర్పడిన రాష్ట్రోపాధ్యాయ సంఘం 79 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా 80 వసంతాల వేడుకలను ఈ ఆదివారం ఖమ్మం రోటరీ నగర్ లో గల శ్రీ రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్ లో జరుగుతాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖరామత్ ఆలీ తెలిపారు.ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డా వెంకటేశ్వర్లు అధ్యక్షత వహిస్తారని,ముఖ్య అతిధులుగా రాష్ట్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందంగౌడ్, జి.గజేందర్,విశిష్ట అతిధిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రత్యేక ఆహ్వానితులుగా సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబీర్ ఆలీ,రాష్ట్ర పూర్వ అధ్యక్షులు యం.పర్వతరెడ్డి,స్థానిక కార్యదర్శి వై కరుణాకర్ రెడ్డి, ఏఐయస్టీయఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.పరమేష్, ఏఐయస్టీయఫ్ జాతీయ కార్యదర్శి టి.పోల్ రెడ్డి తోపాటు ఆహ్వానితులుగా ఏఐఎస్టీయఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వేముల మాధవరావు,సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు దొడ్డా వరప్రసాదరావు హాజరు కానున్నారని,సంఘం సభ్యులు వివిధ మండలాల బాధ్యులు,కార్యవర్గ సభ్యులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వీధి నిర్వహణలో ఉన్న విలేఖరులపై దాడులు సిగ్గు చేటు.మీడియా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి:టియుడబ్ల్యూజే నాయకుల డిమాండ్





**రాజేంద్రనగర్,జులై23,నేటిశుభోదయ :**
ఆందోళనలు,ప్రజా ఉద్యమాలు,నిరసనలు ప్రజాస్వామ్య హక్కులేనని, అయితే విధి నిర్వహణలో ఉన్న పత్రిక,మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరైంది కాదని టియూడ బ్లూజే (హెచ్ 143) రంగారెడ్డి జిల్లా అధ్యక్షా కార్యదర్శులు ఉపరి శేఖర్ సాగర్,గాదం రమేష్,కోశాధికారి పి.వెంకటేష్ లు అన్నారు.బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కొందరు రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రజలకు,ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలుస్తూ,అన్ని రాజకీయ పార్టీల కార్యకలాపాలను నిష్పాక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులపై తరచూ దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా,పత్రిక విలేకరులపై దాడులు జరుగడం విచారకరమన్నారు.విలేకరులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఓటు ప్రతి ఒక్కరి బాధ్యత : బి ఎల్ ఓ కిషోర్



**వైరా,జూలై 23, నేటి శుభోదయ :**
వైరా మున్సిపాలిటీ పరిధిలో 20 వ వార్డ్ శాంతి నగర్, పోలింగ్ స్టేషన్ 176 పరిధి లో నిర్వహించిన సర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయింది.ఈ ముగింపు కార్యక్రమం సందర్భంగా బి ఎల్ వో టీమ్ ఎం కిషోర్ మాట్లాడుతూ మొత్తం 728 ఓట్లు సర్వే చేయగా అందులో మరణించిన వారు 13,డబల్ 4,షిఫ్ట్ అయినవి 37 మొత్తం 54 ఓట్లు తొలగించగా ప్రస్తుతం 674 మంది ఓటర్లు ను ఇఫ్ డిజిటల్ చేయాడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన తేదీ కంటే ముందుగానే కంప్లీట్ చేసిన బీ ఎల్ ఓ కిషోర్ గ అభినందించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు ఉండ్రు శ్యాంబాబు స్కూల్ టీచర్స్ రామకృష్ణ రెడ్డి ,కరుణ ,వి ఏ బేగ్ ముస్తఫా,బిక్యా ,షకీల్,తేజావత్ కుసుమ,యడ్లపృథ్వి,బోజ రాజు,సోరి తదితరులు పాల్గొన్నారు

## ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించిన కమీషనర్



**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :**
కమిషనర్ గారు దానవాయిగూడెంలోని ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను ఖమ్మం కమీషనర్ పరిశీలించారు. 2024 సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా నీటమునిగిన ఎఫ్ఎస్‌టీపీని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పునరుద్ధరించి తిరిగి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చింది.ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌టీపీలో పనిచేస్తున్న కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించే సమయంలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ కిట్లు ధరించి సురక్షితంగా పనిచేయాలని సూచించారు.అదేవిధంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ తరపున కార్మికులకు పిపిఈ కిట్లు, రూ.5 లక్షల ప్రమాద బీమా (ఇన్సూరెన్స్) కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రతిరోజూ 10 నుండి 15 సెప్టిక్ ట్యాంకర్ల ద్వారా వచ్చే మలిన వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయడానికి అవసరమైన వనరులు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎఫ్ఎస్‌టీపీలో రోజుకు సుమారు 70 కిలోలీటర్ల (కేఎల్ డి) మలిన వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. ఏ రోజు వచ్చిన మలిన వ్యర్థాలను అదే రోజు ప్రాసెసింగ్ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.ప్రతి కార్మికుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నగరంలోని అన్ని సెప్టిక్ ట్యాంకుల మలిన వ్యర్థాలు తప్పనిసరిగా ఎఫ్ఎస్ టిపి కు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎఫ్ఎస్ టిపి ను సమర్థవంతంగా నిర్వహించి ప్రతిరోజు వచ్చిన మలిన వ్యర్థాలను అదే రోజు శుద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఖమ్మం నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఈఈ) శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నరేంద్ర తేజ, సివిఆర్ జేవి ఎం.డి. త్రిభువన్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్, ప్లాంట్ సూపర్వైజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు

**భద్రాచలం, జూలై 23, నేటి శుభోదయ :**
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గురువారం ఉదయం 08.00 గంటల నుండి 10.00 గంటల వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ప్రతిష్టమైన ప్రణాళికతో వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, పాత నేరస్తులను కనుగొనడానికి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు.గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం,రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను చేపట్టడం,పాత నేరస్తులను కనిపెట్టే విధంగా ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా ప్రతి ఒక్కరి వేలిముద్రలను తనిఖీలు చేయడం జరిగిందని అన్నారు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, ముఖ్య రహదారులు, గ్రామాల్లో ఈ నాకాబందీ నిర్వహించబడిందన్నారు.ఈ ప్రత్యేక తనిఖీలలో మొత్తం 3714 వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో 2384 ద్విచక్ర వాహనాలు, 987 నాలుగు చక్రాల వాహనాలు, 434 లారీలు ఉన్నాయి.తనిఖీల సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 510 మంది, నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన లేదా నంబర్ ప్లేట్ లేని 308 వాహనాలు, హెల్మెట్ ధరించని 524 మంది, సీటు బెల్ట్ ధరించని 106 మంది, మైనర్లు నడిపిన 14 వాహనాలు, అక్రమంగా సైలెన్సర్ మార్పులు చేసిన 4 వాహనాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో 07 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే 15 అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకోగా, తనిఖీల్లో చోరీకి గురైన ద్విచక్ర వాహనాని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 7 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగింది.నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలపై 764 స్పాట్ చల్లనలను విధించగా, 1567 వాహనాల నుండి జరిమానా వసూలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ




ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.అలాగే అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ ఎంపీ నామ శుభాకాంక్షలు

**ఖమ్మం, జూలై 23 ,నేటి శుభోదయ :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినం (జూలై 24) సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మీడియా కు ఒక ప్రకటన విడుదల చేసారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో, ముఖ్యంగా ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాల్లో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించి, హైదరాబాద్‌ను ప్రముఖ ఐటీ, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న యువ నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే నాయకత్వం ఆయనదని తెలియజేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు, మొక్కల నాటడం, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, సైకిల్ పంపిణీ, నిరుపేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను చేపట్టాలనే కేటీఆర్ ఆలోచన యువతకు స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. రానున్న రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో



బీఆర్ఎస్ మరింత బలోపేతం కావాలని, తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు నామ తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బిజెపి--- ప్రశ్నిస్తే గాంధీ భవన్ పై దాడి

**ఖమ్మం,జూలై 23, నేటి శుభోదయ :**
దేశంలో ప్రస్తుతం నెలకొన్న నీట్ పరీక్ష అవకతవకలు, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, నిత్యావసర ధరల పెరుగుదలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది విద్యార్థుల కష్టాన్ని, కలలను బిజెపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. నీట్ లో జరిగిన అక్రమాలపై సరైన విచారణ చేయకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ గాల్లో కలిసిపోయిందని, యువత రోడ్లపైకి వస్తుంటే బిజెపి మాత్రం ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని అన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలతో సామాన్యుడు బతకలేని పరిస్థితి వచ్చిందని తెలిపారు.విద్య, వైద్యాన్ని కార్పొరేట్లకు అప్పగించి పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్న బిజెపి విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోన్న కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అదే విధంగా ఓట్ చోరి,సీటు చోరీకి నిదర్శనంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వంటి నిర్వాహకాలు నిర్వహిస్తూ అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై దాడులు



చేయడం దారుణమని అన్నారు. శాంతియుత మార్గంలో మోడీ ఇంటి వద్ద నిరసన చేస్తున్న లోక్ సభ పక్షనేత ఏ ఐ సి సి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ పై బీజేపీ గుండాలు దాడి చేసి గాయపరచారని ఇది ప్రజాస్వామ్యనికి మాయని మచ్చ గా నిలుస్తుందని అన్నారు. అంతే కాకుండా నీట్ విదార్థులకు న్యాయం చేయమని అడిగినందుకు బిజెపి నేతలు గాంధీ భవన్ పై దాడి చేయడం సిగ్గు మలిన చర్య అని అన్నారు.అక్రమాలు చేస్తాం ఎదురొస్తే దాడీ చేస్తాం అంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని త్వరలోనే బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

## ధర్పల్లి. ఇందల్వాయి మండలాల్లో హోరెత్తిన నిరసనలు.. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు

**నిజామాబాద్ రూరల్. ధర్పల్లి ఇందల్వాయి,జూలై 23, నేటి శుభోదయ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా ధర్పల్లి.ఇందల్వాయి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఖండిస్తూ, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ నిరంతరం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం ఇందల్వాయి లో మండల బీజేపీ అధ్యక్షుడు జిల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది ధర్పల్లి మండలం లో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు దాసు,ఆధ్వర్యంలో జరిగింది పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఘన నివాళి

**ఖమ్మం, జూలై 23,నేటి శుభోదయ :**
జూలై 23న స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ "దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ ధైర్యసాహసాలు, బాలగంగాధర్ తిలక్ దేశభక్తి భావాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. విద్యార్థులు వారి ఆదర్శాలను జీవితంలో ఆచరిస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలి" అని అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "స్వేచ్ఛను సాధించడానికి మహనీయులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువరాదు. వారి జీవిత చరిత్రలను చదివి, వారు చూపిన మార్గంలో నడవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం

**షాబాద్, జూలై 23,నేటి శుభోదయ :**
నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడుపల్లి పెంటారెడ్డి డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులను,విద్యార్థులపై లాఠీ చార్జ్ ని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలో షాద్నగర్ – కంది జాతీయ రహదారిపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను పార్టీ నాయకుల తో కలిసి దహనం చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని మండిపడ్డారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించి, ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే తొలగించాలన్నారు.అలాగే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరీక్షా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంతో పాటు విద్యార్థుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మల్లేష్, తమ్మలి రవీందర్, వెంకట్ రెడ్డి, గడ్డం చంద్రయ్య మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న గట్టుఇప్పలపల్లి చిన్ననాటి స్నేహితులు

**తలకొండపల్లి, జూలై 23, నేటి శుభోదయ :**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఇటీవల చనిపోయిన శంకర్ కుటుంబన్ని గ్రామానికి చెందిన 2006–2007 బ్యాచ్ పదో తరగతి పాత విద్యార్థి శంకర్ అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని చిన్ననాటి స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.గురువారం శంకర్ నివాసానికి చేరుకున్న పదో తరగతి మిత్రులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం తమ స్నేహితుడి జ్ఞాపకార్థం,మానవత్వంతో కూడిన ఉదారతను చాటుకున్నారు.కుటుంబానికి తక్షణ సహాయంగా ₹47,000 నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో బొల్లి రమేష్, అమర్ సింగ్,విజేందర్, కిరణ్, కొమ్ము రమేష్, శివ శంకర్, నూనె రాఘవేందర్ తదితర స్నేహితులు పాల్గొని, శంకర్ కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకుని కాలువ తవ్వకం.. ప్రమాదంలో తారు రోడ్డు!

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, జూలై 23,నేటి శుభోదయ :**
ధర్పల్లి మండలం రామడుగు నుండి కేశరాం వెళ్లే ఆర్ అండ్ బి (R&B) రోడ్డును ఆనుకుని కాలువ తవ్వడం జరిగిందని, దీనివల్ల రోడ్డు కోతకు గురై ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అతి సమీపంలో నీటి కాలువ తీయడం వల్ల రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ఈ ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన స్థానిక రెండు గ్రామాల సర్పంచ్ లు, వి డీ సి సభ్యులు ,మరియు రైతులు అక్కడ పరిశీలన చేసి ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద వాహనాలు వెళితే రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయే అవకాశం ఉన్నందున, సంబంధిత ఆర్ అండ్ బి (R&B) అధికారులు తక్షణమే స్పందించి తగిన రక్షణ గోడ లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పెద్ద ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.





## సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు



**ఖమ్మం, జూలై 23,నేటి శుభోదయ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు, ఆదేశానుసారం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, శ్రీనివాస నగర్లో బాలికల కోసం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్ పివి) వ్యాక్సిన్పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ కారణంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) వచ్చే ప్రమాదం ఉందని, దీనిని నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన వయస్సు గల బాలికలకు సరైన సమయంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడే అవకాశాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.తల్లిదండ్రులు తమ కుమార్తెల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై పూర్తి అవగాహన కలిగి, వైద్యుల సూచనల మేరకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా ఎంతో అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో కె.వి. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఆరోగ్య కార్యకర్త శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, బాలికలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## టిబి పై అవగాహన అవసరం

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :**
జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యం లో గురువారం టిబి అలెర్ట్ ఇండియా డిస్ట్రిక్ట్ టిబి ఛాంపియన్స్ ట్రైనింగ్ జిల్లా క్షయ నివారణ కార్యాలయం సహకారంతో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా డాక్టర్ నివేదితా టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ సమాజం లోని టిబి ఛాంపియన్స్ యొక్క బాధ్యతలను తెలియజేశారు. ముఖ్యంగా 0–14 సంవత్సరాల లోపు పిల్లల్లో పెరుగుతున్నటువంటి టిబి కేసులు పై శ్రద్ధ వహించాల్సిన బాధ్యతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో టిబి అలెర్ట్ ఇండియా సిబ్బంది వెంకట్ (డిపిఎం), ప్రభాకర్, గంటయ్య, శివకుమారి, క్షయ నివారణ సిబ్బంది ఇందిరా,ఉపేందర్, హిమామ్, రాజ్యలక్ష్మి , ఇందిరా, సురేష్ పాల్గొన్నారు.







## చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి : ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్



**నిజామాబాద్ రూరల్ సిరికొండ ,జూలై 23, నేటి శుభోదయ :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (POW) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సుభద్ర డిమాండ్ చేశారు. సిరికొండ మండలం తాళ్ల రామడుగు గ్రామం లో నిర్వహించిన POW జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకుండా, రాజకీయాల్లో మరియు చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.అలాగే, ఇటీవల నీట్ అంశంపై ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జీని POW తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 28,29న అతిథి అధ్యాపక ఇంటర్వ్యూలు

**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి డిగ్రీ కళాశాలలో 2026–27 వార్షిక విద్యా సంవత్సరం లో వివిధ విభాగాలలో అతిథి అధ్యాపకుల గా పనిచేయడానికి ఎంపిక కోసం ఈనెల 28,29 తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు.28నకంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ , డేటా సైన్స్ ,బి.సి.ఎ,బి.బి.ఎ , బిజినెస్ అనలిటిక్స్, గణితం, ఇంగ్లీష్ పోస్టులకు,29నబయోటెక్నాలజి, స్టాటిస్టిక్స్, బి ఎఫ్ ఎస్.ఐ, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అభ్యర్థులు ఈ మార్పు ను గమనించి హాజరు కావాలని సూచించారు.

## దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు జోనల్ కమిషనర్ ఆదేశం



**నేరెడ్ మెట్ , జూలై 23, నేటి శుభోదయ :** మల్కాజిగిరి జోనల్ కమిషనర్ మౌలాలి సర్కిల్ పరిధిలోని వివేకానందపురంలో కమ్యూనిటీ హాల్‌తో పాటు దెబ్బతిన్న సీసీ రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్వహణ, రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. దెబ్బతిన్న సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులను తక్షణమే చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తనిఖీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్, కేటీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారు : మెతుకు ఆనంద్





**వికారాబాద్, జూలై 23, నేటి శుభోదయ** వికారాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే మాజీ పట్టణ అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. రామయ్యగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు పంపిణీ చేయగా, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అనంతరం కేటీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి రోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పంచుకున్నారు.ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఆ ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన సమాధానం చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, భాష ప్రజలకు ఆమోదయోగ్యంగా లేదని, అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గత ప్రభుత్వం కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరకపోగా, ఇప్పటికే అమలులో ఉన్న పథకాలే కనుమరుగవుతున్నాయనే భావన ప్రజల్లో ఉందన్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.రామయ్యగూడ ప్రభుత్వ పాఠశాలలో శిథిలావసకు చేరుకున్న భవనాలు విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారాయని, వాటిలో పాములు సంచరిస్తుండటంతో పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. గతంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో శిథిల భవనాలను తొలగించగా, ప్రస్తుతం అలాంటి చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించి పాలనను మెరుగుపర్చాలని, కేసీఆర్‌పై విమర్శలు చేయడం కంటే ప్రజా సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని మెతుకు ఆనంద్ సూచించారు.

## ఎల్‌నినో ప్రభావంపై కేశంపేటలో కాంటింజెన్సీ యాక్షన్ ప్లాన్ సమీక్ష సమావేశం




**కేశంపేట, జూలై 23,నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేశంపేట మండలంలోని ఆల్వాల రైతువేదికలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాంటింజెన్సీ యాక్షన్ ప్లాన్ అమలుపై మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి అధ్యక్షత వహించగా, మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు.సమావేశంలో ఏపీడీ చరణ్ గౌతమ్, మండల పంచాయతీ అధికారి దయానంద్, మండల వ్యవసాయాధికారి రాం శివారావు, అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ అజీజ్ అహ్మద్, మిషన్ భగీరథ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు, ఏఈఓలు, సెర్ప్ క్లస్టర్ కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.మండల ప్రత్యేకాధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ,,,ప్రతి ఇంటికి సోక్‌పిట్, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట, పర్కొలేషన్ ట్యాంకులు, రీచార్జ్ పిట్లు వంటి జల సంరక్షణ నిర్మాణాలను గుర్తించి వీబీజీ రామ్‌జీ పథకం, ఇతర శాఖల కన్వర్జెన్స్ ద్వారా పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి రాకుండా గ్రామస్థాయిలో విస్తృత జల సంరక్షణ చర్యలు అమలు చేయాలని తెలిపారు.ఏడీఏ రమాదేవి రైతులు ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవడం, నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించడం, పంటల సంరక్షణలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని వివరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కాంటింజెన్సీ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## ఇంటర్ టు పీజీ వరకు 24న బంద్ కు పిలుపునిచ్చిన పీడీఎస్‌యూ (PDSU)..




**నిజామాబాద్ రూరల్ సిరికొండ , జూలై 23, నేటి శుభోదయ :** నీట్ (NEET) పేపర్ లీకేజ్ కి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని PDSU మండల అధ్యక్షుడు మారుపాక రాజేష్ డిమాండ్ చేశారు.అలాగే ఈ నెల 24వ తేదీన విద్యాసంస్థల బంద్ పాటించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్రప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.గడిచిన 20 రోజులుగా జంతర్ మంతర్ కేంద్రంగా నిరసన చేపట్టినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని, ఇది తీవ్ర బాధాకరమైన విషయమని అన్నారు. సమస్యలు ఇలానే కొనసాగితే బిజెపి కేంద్రమంత్రి రాజీనామా చేసి, తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పి డి ఎస్ యూ (PDSU) తరఫున డిమాండ్ చేశారు.

## భూములు కోల్పోతున్న రైతుల పక్షాన భూ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



**ఇబ్రహీంపట్నం ,జూలై 23, నేటి శుభోదయ :** యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మూడవ రోజు నిరాహార దీక్ష ప్రారంభించారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి నాయకులు మాట్లాడుతూ, పారిశ్రామిక పార్కు కోసం సర్వే నెంబర్లు 19, 68, 127లలో మొత్తం 677.29 ఎకరాల భూమిని అధికారులు సర్వే చేశారని, అయితే ఆ సర్వేలో అనేక లోపాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రైతుల అభిప్రాయాలను పట్టించుకోకుండా, వారి హక్కులను కాలరాస్తూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు.నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, రైతుల ప్రాణాధారమైన భూములను ప్రభుత్వం తీసుకుంటే అందుకు తగిన న్యాయం చేయాలని, ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత ధరల ప్రకారం పరిహారం నిర్ణయించడం రైతులకు తీవ్ర అన్యాయం అవుతుందని పేర్కొన్నారు.వాస్తవంగా రైతుల పేర్లపై ఉన్న రికార్డు భూమి ఎంత, రైతులు సంవత్సరాలుగా సాగు చేస్తున్న కబ్జా భూమి ఎంత అనే విషయాన్ని అధికారులు స్పష్టంగా వెల్లడించాలని కోరారు. సాగు చేస్తున్న భూములకు సరైన పరిహారం అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే కబ్జాలో ఉన్న భూములకు పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదని, దీనిపై వెంటనే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఏడీ సర్వేయర్ ఆధ్వర్యంలో రీ–సర్వే నిర్వహించాలని కోరారు.భూ సేకరణ మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని, రికార్డు భూములు మరియు కబ్జా భూములకు సంబంధించిన పరిహార చెక్కులను ఒకేసారి పంపిణీ చేయాలని అన్నారు. సర్వేలో నమోదు చేసిన రైతుల వివరాలు,ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్, "రైతుల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది. రైతులకు న్యాయం జరిగే వరకు ఈ ఉద్యమం ఆగదు. అధికారులు రాజకీయ నాయకులు, భూ కబ్జాదారుల ప్రయోజనాలను కాకుండా రైతుల ప్రయోజనాలను కాపాడాలి. రైతుల ఆవేదనను ప్రభుత్వం వెంటనే గుర్తించి న్యాయమైన నిర్ణయం తీసుకోవాలి" అని అన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు ఈ దీక్ష కొనసాగిస్తూనే ఉంటామని అన్నారు.

## కోర్టు తీర్పు రాకముందే రైతుల భూముల్లో బలవంతపు చర్యలు





**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** నాగపూర్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం కోసం రఘునాథపాలెం మండలంలో భూసేకరణకు అధికారులు చేసిన ప్రయత్నాన్ని రైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. గురువారం రఘునాథపాలెం యాపిల్ సెంటర్ వద్ద నేషనల్ హైవే అధికారుల సర్వేను రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసుల భారీ బందోబస్తు మధ్య అధికారులు బుల్డోజర్లతో పంట పొలాల్లోకి ప్రవేశించి మొక్కలను తొలగిస్తూ భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయగా, రైతులు, రైతు సంఘం, సీపీఎం నాయకులతో కలిసి అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. నవీన్ రెడ్డి మాట్లాడుతూ సారవంతమైన వ్యవసాయ భూములను నేషనల్ హైవే పేరుతో స్వాధీనం చేసుకోవద్దని రైతులు ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. కేసు విచారణ పూర్తై ఈ నెల 28న తీర్పు రిజర్వులో ఉన్నప్పటికీ, కోర్టు తీర్పు వెలువడక ముందే అధికారులు పోలీసుల అండతో భూసేకరణకు దిగడం చట్టవిరుద్ధమని విమర్శించారు. కోర్టు తీర్పు వెలువడే వరకు భూసేకరణకు సంబంధించిన అన్ని చర్యలను నిలిపివేసి, రైతుల హక్కులను గౌరవించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్సై తేజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, ఎమ్మార్వో శ్వేత, ఆర్ఐతో పాటు నేషనల్ హైవే అధికారులు భూసేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు తక్కెళ్లపాటి భద్రయ్య, నాగండ్ల శ్రీధర్, పాపినేని రామ నరసయ్య, కిషోర్ తదితర రైతులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## కామర్స్ విద్యా రంగంలో ప్రతిభకు గుర్తింపు

### -డా. డి. సంజీవరావు, డా. ఎల్.వి. కమలాదేవికి ఉత్తమ కామర్స్ అధ్యాపకుల పురస్కారాలు




**నేరెడ్ మెట్, జూలై 23, నేటి శుభోదయ :** ఉన్నత విద్యా రంగంలో విశిష్ట సేవలు, నాణ్యమైన బోధన, పరిశోధనలో కృషికి గుర్తింపుగా ప్రముఖ విద్యావేత్తలు డా. డి. సంజీవరావు మరియు డా. ఎల్.వి. కమలాదేవిలకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టికల్ అకౌంటెన్సీ (ఐపీఏ) ప్రతిష్ఠాత్మక 'ఉత్తమ కామర్స్ అధ్యాపకుల పురస్కారం' ప్రకటించింది.డా. డి. సంజీవరావుకు 2026 సంవత్సరానికి, డా. ఎల్.వి. కమలాదేవికి 2025 సంవత్సరానికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. ఇద్దరూ రెండున్నర దశాబ్దాలకు పైగా కామర్స్ విద్యా రంగంలో సేవలందిస్తూ విద్యార్థుల ప్రతిభ వికాసం, నాణ్యమైన బోధన, పరిశోధన, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, అధ్యాపక శిక్షణ కార్యక్రమాలు, విద్యార్థులకు మార్గదర్శకత్వం వంటి అంశాల్లో విశేష సేవలు అందిస్తున్నారు.జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టుల్లో చురుకుగా పాల్గొంటూ ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు విశేష కృషి చేసినందుకు ఈ పురస్కారాలు లభించినట్లు ఐపీఏ పేర్కొంది.ఈ సందర్భంగా డా. డి. సంజీవరావు, డా. ఎల్.వి. కమలాదేవి తమకు సహకరించిన యాజమాన్యం, సహచర అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని ఉపాధ్యాయ వృత్తికి అంకితం చేస్తూ, భవిష్యత్తులో కూడా విద్యా సేవలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యా రంగ ప్రముఖులు, అధ్యాపకులు, సహచరులు ఇద్దరు అధ్యాపకులను అభినందిస్తూ, ఈ పురస్కారాలు కామర్స్ విద్యా రంగంలో వారి సేవలకు దక్కిన సముచిత గుర్తింపుగా పేర్కొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ఎన్ ఎస్ యుఐ పిలుపు

**కేశంపేట, జూలై 23, నేటి శుభోదయ :**
నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తూ రేపు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎన్ ఎస్ యుఐ పిలుపునిచ్చినట్లు కేశంపేట మండల ఎన్ ఎస్ యుఐ నాయకులు తెలిపారు.నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నమ్మకాన్ని నిలబెట్టేలా పారదర్శకమైన పరీక్షా విధానాన్ని అమలు చేయాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు సహకరించాలని ఎన్ఎస్ యుఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హక్కుల కోసం చేపడుతున్న ఈ పోరాటానికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు.ఈ



సందర్భంగా కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుమగల్ల రమేష్, సర్పంచ్ భాస్కర్, ఎన్ఎస్ యుఐ నాయకులు లింగం, అమీర్, అజర్, రాజేష్, శ్రీకాంత్, సచిన్, రాజు తదితరులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## విద్యార్థులకు అండగా మేముంటాం

**షాద్నగర్ ,జూలై 23, నేటి శుభోదయ :**
షాద్ నగర్ పట్టణ కూడలిలో నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలు బలి అయ్యాయని, 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అయినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అండగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే విద్యార్థులపై లాఠీలు విసరడమే కాకుండా, రాహుల్ గాంధీని కూడా గాయపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ముందుకు రావడంలేదని అన్నారు. ఇప్పటిదాకా గాంధేయ మార్గంలోనే ఆందోళన చేశామని, ప్రభుత్వం దిగి రాకుంటే పార్లమెంటును ముట్టడించడానికి కూడా తాము సిద్ధమే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఒక అసమర్ధ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉన్న ఏ దేశంలో ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇలా ప్రభుత్వాన్ని కొనసాగించడం దారుణమని అన్నారు. అందుకే ప్రభుత్వంతో విసిగి వేసారిన విద్యార్థులు ఆందోళనకు దిగారని, వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ముందుకు నడుస్తుందని, వారికి సమాధానం దొరకేదాకా తాము బాసటగా ఉంటామని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులను లాఠీలతో కొట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వాలలో తప్పులు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేశారని, కేవలం రైలు ప్రమాదం జరిగినందుకే నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ శాస్త్రి లాంటివాళ్ళు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. అలాంటిది విద్యార్థులకు ఇంత అన్యాయం జరుగుతున్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోమని, పోరాటమే మార్గంగా ముందుకు సాగుతామని ఆయన హెచ్చరించారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**వరంగల్ , జూలై 23, నేటి శుభోదయ :**
కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు తెలిపారు. గురువారం కరీంనగర్ లోని ఫెడరేషన్ కార్యాలయ ఆవరణలో ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్దత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ



స్కీం అమలుకావడంలేదని,అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో జిల్లా నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు లక్కం సురేష్, కొమ్ము గణేష్, జిల్లా సహాయ కార్యదర్శులు అతికం రాజశేఖర్, గుండి కిరణ్, నాయకులు దీక్షిత్ , కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేటలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కేశంపేట, జూలై 23, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాజేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీమ్ రెడ్డి మాట్లాడుతూ,,, రెడ్ క్రాస్ సొసైటీ ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలను అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. విపత్తుల సమయంలో సహాయం అందించడం, రక్తదానం, ఆరోగ్య సేవలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో సంస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.సమాజ సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల వైపు ఆకర్షితులు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగదీష్ గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేశారు. కేశంపేట మండలంలో మరింత విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టి, అధిక సంఖ్యలో ప్రజలను రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మానవతా సేవలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కేశంపేటలో కాంగ్రెస్ భారీ ధర్నా



**కేశంపేట, జూలై 23, నేటి శుభోదయ :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టు, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌ను నిరసిస్తూ కేశంపేటలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు గూడా వీరేష్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,, నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని విమర్శించారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్‌పై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, విద్యార్థులపై లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు

## వీధి లైట్ల ఏర్పాటు లో 'పాలెపు' వెంకటరమణ మార్క్



**ఖమ్మం, జూలై 23, నేటి శుభోదయ :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ డాక్టర్ తుమ్మల యుగంధర్ సహకారంతో స్థానిక 44 వ డివిజన్ లో తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ పర్యవేక్షణలో డివిజన్ లో 20 "వీధిలైట్లు అమర్చడం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు అభినందనలు తెలిపారు. అప్పుడు, ఇప్పుడు కూడా డివిజన్ అభివృద్ధి విషయం లో పాలెపు విజయ వెంకటరమణ మార్క్ ఉంటుంది అని చెప్పక తప్పదు మరి..

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**కేశంపేట , జూలై 23, నేటి శుభోదయ :**
కేశంపేట మండల పరిధిలోని బోదునంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రామయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చారు. మృతుని కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్ రెడ్డి రూ.5 వేలు, గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ రూ.3 వేలు, మొదటి వార్డు సభ్యుడు ఎదిరే బీరప్ప రూ.2 వేలు కలిపి మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎదిరే అంజయ్య, వార్డు సభ్యులు ఎదిరే బీరప్ప, పిప్పళ్ళ నరేందర్, నాయకులు ఎదిరే ఆంజనేయులు, మెలిగిరి యాదగిరి, ఎదిరే అంజనేయులు, ఎదిరే వెంకటేష్, బాయి గడ్డ మహేష్, ఎదిరే వెంకటయ్య, కుమ్మరి నర్సింహ, చాకలి బార్లాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతకు జూలై 25న జాబ్ మేళా : జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**ఖమ్మం, జూలై 23,
నేటి శుభోదయ :**
ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 25న శనివారం నాడు ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళా ద్వారా ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు. భారత్ హ్యుందాయ్, వరుణ్ మోటార్స్, అపోలో ఫార్మసీ సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని వివిధ విభాగాల్లో అభ్యర్థులను నియమించనున్నట్లు పేర్కొన్నారు.భారత్ హ్యుందాయ్ లో సర్వీస్ అడ్వైజర్లు, ఫైనాన్స్ కోఆర్డినేటర్లు, టెక్నీషియన్లు, టెలీ కాలర్ పోస్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే వరుణ్ మోటార్స్ లో ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్, రిలేషన్‌షిప్ మేనేజర్లు, బాడీ అడ్వైజర్లు, డెంటర్లు, టెక్నీషియన్ల పోస్టులకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు డిగ్రీ, డిప్లొమా, ఐ టి ఐ అర్హత గలవారు అరుగ్లులని, ఎంపికైన వారికి 12 వేల నుండి 20 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అపోలో ఫార్మసీ, హైదరాబాద్ లో ఫార్మసిస్టులు, ఫార్మసీ అసిస్టెంట్ల కోసం 50 ఖాళీలు ఉన్నాయని, డి.ఫార్మసీ లేదా బి.ఫార్మసీ అర్హత కలిగిన 19 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.20 వేల వరకు వేతనం అందజేయనున్నట్లు వెల్లడించారు.అర్హత, ఆసక్తి గల ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో జూలై 25న నిర్వహించే జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి కోరారు. జాబ్ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7036902902, 8247656356 నంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

## సదాశివపేట ఐకెపి కేంద్రంలో వివిధ శాఖలతో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష



**సంగారెడ్డి ప్రతినిధి,జులై 23,
నేటి శుభోదయ :**
గురువారం సదాశివపేట ఐకెపి కేంద్రంలో స్పెషల్ ఆఫీసర్ శ్ రవి కిరణ్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల పనితీరు, ప్రగతి, పెండింగ్ పనులపై స్పెషల్ ఆఫీసర్ సమగ్రంగా సమాచారం తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చూడాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండల తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్, మండల అభివృద్ధి అధికారిణి అంజనీ దేవి, మండల విద్యాధికారి యన్ శంకర్, పంచాయతీరాజ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పదోన్నతితో బదిలీ అయిన ఏడీఈ అశోక్ కుమార్‌కు ఘన వీడ్కోలు





**శామీర్‌పేట, జూలై 23, నేటి శుభోదయ :**
పదోన్నతిపై డీఈగా బదిలీ అయిన షామీర్‌పేట విద్యుత్ శాఖ ఏడీఈ అశోక్ కుమార్‌కు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఈ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు అశోక్ కుమార్ సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడీఈ రాజమల్లు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి సమిష్టిగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనుల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఏఈ విజయ్ కుమార్ మాట్లాడుతూ, అశోక్ కుమార్‌తో కొద్దికాలం మాత్రమే కలిసి పనిచేసినా ఎంతో ఆత్మీయ అనుబంధం ఏర్పడిందన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ అందరికీ ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలోనే సేవలు కొనసాగిస్తామని చెప్పారు.అశోక్ కుమార్ మాట్లాడుతూ, దాదాపు రెండేళ్లపాటు తమతో కలిసి పనిచేసిన అధికారులు, సిబ్బంది సహకారంతో రైతులు, పట్టణ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సేవలు అందించగలిగామని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం విద్యుత్ శాఖ సిబ్బంది అశోక్ కుమార్‌ను శాలువాతో సత్కరించి, పూలమొక్కను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

## టీజెఏ 12వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ పండ్ల పంపిణీ





**షాద్నగర్, జూలై 23, నేటి శుభోదయ :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్న పత్రం లీకేజ్ వ్యవహారంపై పరీక్ష పేపర్ లీకేజ్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పలు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ,విద్యార్థుల న్యాయమైన హక్కులకు మద్దతుగా నిరసన వ్యక్తం చేసిన ఏఐసీసీ నాయకులు,లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ కొత్తూరు మున్సిపాలిటీ మరియు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా,రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశ భవిష్యత్తైన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన పేపర్ లీకేజీ ఘటనలు అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పరీక్షల పారదర్శకతను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే,పేపర్ లీకేజీల కారణంగా వారి శ్రమ వృథా అవుతోందని అన్నారు.విద్యార్థులకు న్యాయం చేయాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు.ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని,ఆ హక్కును కాలరాస్తూ కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం,అరెస్టులు చేయడం బీజేపీ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు.విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని,పరీక్షల నిర్వహణలో పారదర్శకతను తీసుకురావాలని,పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమోని దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జనార్దన్ చారి, కర్రోళ్ల సురేందర్,ఎమ్మె సత్తయ్య, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,ఆంజనేయులు గౌడ్,పీర్లగూడెం మహేష్ గౌడ్, ఎస్బి పల్లి సురేష్,భరత్, పాశం కృష్ణ,ఎస్కే కాజా,చిలకమర్రి నరసింహ,జగన్,విజయపాల్ రెడ్డి,కూన శివకుమార్ గౌడ్,చింత సాయి తేజశ్వర్,పెంటయ్య,నరసింహ గౌడ్,బాలరాజు,రాజు,శివ, లక్ష్మయ్య,తిగాపురం ఆంజనేయులు,సుమన్,అనిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్ భూ బాధితులకు నష్టపరిహారం



**షాబాద్, జులై 23, నేటి శుభోదయ :**
మండల పరిధిలో ప్రతిపాదిత రేడియల్ రోడ్ 2 నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భూములు కోల్పోయిన రైతు లకు 37.11 కోట్లకు పైగా పరిహారం విడుదల అయిందని ఆర్డిఓ పార్థసారధి రెడ్డి,షాబాద్ తాసిల్దార్ అన్వర్ గురువారం రైతులతో సమావేశ కార్యక్రమంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... విశేష సహకారంతో అవార్డు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 344 మంది రైతుల నుండి సమ్మతి లభించగా 228.31 ఎకరాల భూమికి అవార్డులు పూర్తి చేయబడ్డాయి. సోలిపేట్, పెద్దవేడు, హైతాబాద్, దామర్లపల్లి, మరియు మాచనపల్లి గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.37,11,12,500 పరిహారాన్ని జమ చేయడం జరిగింది. దీనితో సంబంధిత రైతులు మెరుగైన పరిహారం లాబించడం తో అత్యంత శ్రీగ్రంగా పరిహారం అందించడంతో సంతోషం వ్యక్తం చేయడం జరిగింది.అలాగే షాబాద్ మరియు బోనగిరపల్లి నాగర్కుంట గ్రామాల రైతుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం నేటి నుండి జమ చేయబడతాయి. అంతే కాకుండా, ఇంటి స్థలాలు కూడా అతి త్వరలో అందించ బడతాయన్నారు.ఈ సందర్భంగా భూసేకరణ ప్రక్రియకు స్వచ్ఛందంగా సహకరించిన రైతులు మరియు ప్రజా ప్రతినిదులకు జిల్లా యంత్రాంగం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. మిగిలిన రైతులు కూడా ఇదే విధంగా సహకరించి ప్రజాప్రయోజనకరమైన రేడియల్ రోడ్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావడానికి తోడ్పడాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సోలిపేట సర్పంచ్ రాజేందర్ రెడ్డి, కేశవ గూడ సర్పంచ్ ఒగ్గు రాజు రైతులు తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణ గుండెచప్పుడు సింగరేణి
## : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు






**ఖమ్మం, సత్తుపల్లి, జులై 23, నేటి శుభోదయ :** పోటీ ప్రపంచంలో సింగరేణి క్యాలరీస్ సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వ్యాపార విస్తరణ ద్వారా భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి తెలంగాణకు ఆత్మలాంటిది. కార్మికులు, ప్రజలతో 130 ఏళ్ల చరిత్రకలిగిన సింగరేణితో భావోద్వేగ అనుబంధం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు లాభదాయకంగా అందించడం మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు. గురువారం సత్తుపల్లిలోని సింగరేణి ఒపెన్ కాస్ట్ బొగ్గుగనిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. గనిలో బొగ్గు లభ్యత, పరిమాణం, బొగ్గు క్వాలటీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుతో పాటుగాఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జెన్ కో సీఎండీ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోట్రూ, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడుతూ మైనింగ్ నిర్వహణలో పాటిస్తున్న పద్ధతులు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలను ప్రత్యక్షంగా చూడటానికే క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ అనేది మైనింగ్ లో బయటకు తీసే మట్టి, రాతి వ్యర్థం. బొగ్గు అనేది సింగరేణికి ప్రధాన రాబడి తెచ్చే అత్యంత విలువైన వనరుగా ఆయన అన్నారు. కాంట్రాక్టర్లకు ఓబి తీసినా, బొగ్గు తీసినా వాల్యూమ్ ప్రకారమే బిల్లులు వస్తాయి కాబట్టి వారి దృష్టిలో రెండూ ఒక్కటే అనిపించవచ్చని, సింగరేణి యాజమాన్యానికి మాత్రం ఓవర్ బర్డెన్, బొగ్గు మధ్య ఉన్న వ్యత్యాసం చాలా స్పష్టంగా తెలిసి ఉండాలన్నారు. ఫేస్ వద్ద బ్లాస్టింగ్ జరిపి, లోడింగ్ చేసే సమయంలో బొగ్గులో ఓవర్ బర్డెన్ మట్టి, రాళ్ళు కలవకుండా చూడాలన్నారు. ప్రతీ షావల్ దగ్గర, ప్రతీ లోడింగ్ పాయింట్ దగ్గర మన అధికారులు ఉండి కంటీన్యూయస్ మానిటరింగ్ చేయాలన్నారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసరమైన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ పవర్ ప్లాంట్లలో ప్రొడక్షన్ తగ్గిపోయి ట్రిప్ అవుతాయని అన్నారు. కల్తీ లేని నాణ్యమైన బొగ్గును మాత్రమే జెన్ కోకు ఇతర కస్టమర్లకు సరఫరా చేయాలని అధికారులకు సూచనలు చేశారు.ఒకప్పుడు బొగ్గు రంగంలో ఏకఛత్రాధిపత్యం ఉండేదని, ఈ రోజు పరిస్థితి మారిందని అన్నారు. మార్కెట్‌లో ప్రైవేటు సంస్థలు పోటీకి వస్తున్నాయని, విదేశాల నుంచి 'ఇంపోర్టెడ్ కోల్' వస్తోందన్నారు. ఈ కాంపిటీటివ్ మార్కెట్ లో సింగరేణి నిలబడాలంటే అత్యంత నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. అంతేకాక బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గించడం ముఖ్యమని తెలిపారు. గత పదేళ్ల కాలంలో కొత్త కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల చాలా అవకాశాలను కోల్పోయామని డిప్యూటీ సీఎం అన్నారు. ఒక కోల్ బ్లాక్ వేలంలో దక్కించుకుని, అక్కడ భూసేకరణ, అటవీ అనుమతులు సాధించి మైనింగ్ ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్ల సమయం పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కనీసం 10 ఏళ్ల ముందస్తు ప్రణాళికతో పని చేయాలని అన్నారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరుగుతుంది? దానికి ఎంత బొగ్గు అవసరం? అనే దానిపై సింగరేణి యాజమాన్యం – జెన్ కో యాజమాన్యం కలిసి కూర్చుని ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల–2, నైని వంటి బ్లాక్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఫారెస్ట్ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని అన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా జరిగే నూతన కోల్ బ్లాక్స్ వేలంలో సింగరేణి పాల్గొనేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.ప్రపంచం మొత్తం ఈ రోజు గ్రీన్ ఎనర్జీ వైపు వెళ్తోంది. సింగరేణి కూడా కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్ ఎనర్జీ రంగంలోకి వేగంగా అడుగులు వేయాలన్నారు. భవిష్యత్తులో థర్మల్ పవర్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, హైడ్రోజన్, న్యూక్లియర్ ఎనర్జీ వాడకం పెరుగుతుందని అన్నారు. దీనికి అనుగుణంగా సింగరేణి సోలార్ పవర్ ఉత్పత్తిపై మరింత దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు.మైనింగ్ రంగంలో సింగరేణి సంస్థకున్న అపారమైన అనుభవం, నిపుణులైన సాంకేతిక శక్తి కేవలం బొగ్గుకే పరిమితం కాకూడదన్నారు. సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అవసరమైన క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, మైనింగ్ ప్రక్రియలోకి సింగరేణి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు.సింగరేణిని కాపాడుకుంటూ, లాభాల బాట పట్టిస్తూ, ప్రపంచ స్థాయిలో నిలబెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి సిద్ధంగా ఉందని డిప్యూటి సీఎం అన్నారు. అధికారులు, ఇంజనీర్లు, కార్మికులు సమన్వయంతో పనిచేసి సింగరేణి ప్రభను మరింతగా వెలిగించాలని డిప్యూటీ సీఎం అన్నారు.అనంతరం కిష్టారం లో నిర్మించిన క్వార్టర్ల ను డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా ఛైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సింగరేణి డైరెక్టర్లు ఎల్. వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, యం. తిరుమల రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ రూరల్‌కు రవీందర్ గౌడ్ నియామకం



**శామీర్ పేట , జూలై 23, నేటి శుభోదయ :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్‌గా నూనెముంతల రవీందర్ గౌడ్‌ను నియమితులైయ్యారు . భాగ్యనగరంలోని సమితి నూతన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ రావినూతుల శశిధర్, బుచ్చిరెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించి సమితి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.23ఎస్ ఎమ్ పి టి 1

# నీట్ పరీక్షలపై రాజకీయాలు మానుకోవాలి - శిగ వీరస్వామి గౌడ్



**ఇబ్రహీంపట్నం , జూలై 23, నేటి శుభోదయ :** ఆదిభట్ల జిహెచ్ఎంసి నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని బీజేపీ మాజీ అధ్యక్షులు, ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన శిగ వీరస్వామి గౌడ్ అన్నారు.నీట్ పరీక్షలను అడ్డుపెట్టుకుని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశంలో విభజనాత్మక వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్న వారిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు.సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్‌కు, నీట్ పరీక్షలకు అసలు సంబంధం ఏమిటో ప్రతిపక్షాలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు.ఇది నవ భారతం,ప్రధాని నరేంద్ర మోదీ భారతమని, ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల కుట్రలకు భారతీయ జనతా పార్టీ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు.మోదీని,బలహీనపరుస్తామనే పగటి కలలు కనడం రాహుల్ గాంధీ ఇకనైనా మానుకోవాలని, సీనియర్ సిటిజన్ వయస్సుకు చేరువవుతున్న ఆయన కాస్త పరిణితితో ప్రవర్తిస్తే మంచిదని సూచించారు.

# బోనాల పండుగకు అమ్మవార్ల దేవాలయాలను ముస్తాబు చేయాలని అధికారులకు ఆదేశం : తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్ర నగర్, జులై 23, నేటి శుభోదయ :** బోనాల పండుగ సవిపిస్తుండడంతో అమ్మవార్ల దేవాలయాలను ముస్తాబు చేయాలని అధికారులను కోరడం జరిగిందని మైలర్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.గురువారం రాజేంద్ర నగర్ నియోజక వర్గ పరిధిలోని మైలర్ దేవ్ పల్లి డివిజన్ ప్రగతి కాలనీ లో బోనాల పండుగ ఉత్సవాలలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాల పండుగ సంబంధించిన ఏర్పాట్లను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి సంబంధించిన ఏర్పాట్లను అన్ని డివిజన్ పరిధిలోని దేవాలయాల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది.దేవాలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ యాదవ్,రావుల భాస్కర్,ప్రతాప్ రెడ్డి,దాసు,చిన్న అక్కెం జంగయ్య యాదవ్,సురేష్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పర్‌పల్లికి 300 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని వినతి



**శామీర్‌పేట్, జులై 23, నేటి శుభోదయ :** శామీర్‌పేట్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి 300 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి. బాలేష్ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 837, 838లో గతంలో ప్రభుత్వం కేటాయించిన ప్లాట్ల భూమి అందుబాటులో ఉందని, గ్రామంలో పెద్ద సంఖ్యలో నిరుపేద కుటుంబాలు సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. ఉప్పర్‌పల్లికి 300 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తే రాష్ట్రంలోనే ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేస్తామని వినతిపత్రంలో తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేలా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు.23ఎస్ ఎమ్ పి 1 ఉప్పరపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని పొంగిలేటికి వినతిపత్రం సమర్పించిన మాజీ జెడ్పిటిసి సభ్యుడు బాలేష్

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ర్యాలీ



**శామీర్ పేట, జులై 23, నేటి శుభోదయ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుల అరెస్టును ఖండిస్తూ అలియాబాద్ మున్సిపాలిటీలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు బిమిడి జైపాల్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులు, వేధింపులు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు.ర్యాలీలో మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏళ్ళ మల్లేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టీజేఏ ముందుండాలి : తుంబూరి దయాకర్ రెడ్డి

**ఖమ్మం, జులై 23, నేటి శుభోదయ :**
జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారంలో తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ (టిజేఏ) ఎల్లప్పుడూ ముందుండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం లో టి జే ఎ జిల్లా అధ్యక్షులు 'జి.నాగాస్వామి ఆధ్యర్యంలో టీజేఏ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా తుంబూరి దయాకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు జర్నలిస్టులు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభమైన మీడియా రంగానికి, అందులో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం టీజేఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు.--- వివిధ ప్రాంతాల్లో ఘనంగా వేడుకలుఎస్బీఐ కాలేజీలో కేక్ కటింగ్:నగరంలోని ఎస్బీఐ కాలేజీలో టీజేఏ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కాలేజీ చైర్మన్ ఆర్.జె.సీ. కృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమక్షంలో కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులుగా జర్నలిస్టులు నిలుస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం టీజేఏ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.--- ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో టీజేఏ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. రోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించి వారికి పండ్లు అందించడం అభినందనీయమని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.వృద్ధాశ్రమంలో ప్రేమ పూర్వక సేవలు:పాండురంగాపురంలోని జీసస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమవాసుల మధ్య వార్షికోత్సవాన్ని జరుపుకోవడం, వారి క్షేమాన్ని పంచుకోవడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా అధ్యక్షుడు అక్రిడేషన్ కమిటీ మెంబర్ జి నాగస్వామి టీజేఏ జిల్లా నాయకులు మతి రామకృష్ణ( విజయ క్రాంతి) సాయంకాలం రాంబాబు మణికుమార్ సయ్యద్ ఖాసిం ( అక్షిత దినపత్రిక ) వాసం రాజేంద్రప్రసాద్( క్రైమ్ మిర్రర్) తాళ్లపల్లి అశోక్ ( యువ గళం) సంపత్ (సంచలన వార్త) దోమల కిరణ్ మధ్యలో చిన్ని పగిడిపల్లి రవి కిరణ్ బోడబట్ల సతీష్ గంజి బ్రహ్మం పామర్తి నాగేశ్వరరావు మల్లె బోయిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో తెలంగాణ జర్నలిస్టుల అసోసియేషన్ (టీజేఏ) జిల్లా, నగర నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్లు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.






# వర్షాభావం వస్తే ప్రత్యామ్నాయ పంటలే మేలు

**షాద్ నగర్, జులై 23 , నేటి శుభోదయ :**
ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలం–2026 అత్యవసర (కాంటింజెన్సీ) పంట ప్రణాళికపై రైతులు సర్పంచులు ప్రజాప్రతినిధులు మండల గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు గురువారం ఫరూక్‌నగర్ మండలంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల సాగు తేమ సంరక్షణ చర్యలు ఎరువుల యాజమాన్యం పురుగులు–తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు 31 జూలై నుంచి 15 ఆగస్టు 2026 వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంచుకోవాలని సూచించారు ఇంకా విత్తని భూముల్లో కనీసం 50–75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని తెలిపారు కంది,పెసర,మినుము, అలసందబిజొన్న, సజ్జ,కొర్ర, రాగి నువ్వులు ఆముదం వంటి స్వల్పకాలిక తక్కువ నీటి అవసరమున్న పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు మొక్కజొన్న పంటకు తేమ కొరత ఉంటే కొత్తగా విత్తడం నివారించాలని ఇప్పటికే సాగులో ఉన్న పంటల్లో కలుపు నివారణ తగిన తేమ ఉన్నప్పుడు మాత్రమే యూరియా పైపూత మల్చింగ్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు ఫాల్ ఆర్మీవార్మ్ ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మాత్రమే వరి సాగు చేపట్టాలని నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పప్పుధాన్యాలు చిరుధాన్యాలను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలని సూచించారు పత్తి పంటలో గ్యాప్ ఫిల్లింగ్ పూర్తి చేయడంతో పాటు కలుపు నివారణ చేపట్టాలని తెల్లదోమ తామర పురుగు జాసిడ్ వంటి పురుగుల ఉధృతిని పర్యవేక్షించాలని తెలిపారు తేమ కొరత ఉన్న సమయంలో అధిక నత్రజని ఎరువులు వినియోగించరాదని సూచించారు పప్పుధాన్యాల్లో విత్తన శుద్ధి చేసి విత్తడంతో పాటు రైజోబియం పీఎస్‌బీ వంటి జీవ ఎరువులను వినియోగించాలని తెలిపారు వర్షాభావ పరిస్థితుల్లో నేలలో తేమను సంరక్షించేందుకు అంతర దుక్కులు, కలుపు నివారణ,మల్చింగ్,ఫార్మ్ పాండ్లు,చెక్‌బండ్ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని తేమ ఉన్నప్పుడు మాత్రమే యూరియా వేయాలని జీవ మరియు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తెలిపారు పంటలను వారానికి కనీసం రెండుసార్లు పరిశీలిస్తూ ఆర్థిక నష్టం స్థాయి దాటిన తర్వాతే పురుగుమందులు వినియోగించాలని సూచించారుఆగస్టు 15 నాటికి వర్షాలు సాధారణ స్థాయికి రాకపోతే వరి మొక్కజొన్న కొత్తగా సాగు చేయకుండా కంది ఆముదం,సజ్జ,జొన్న,కొర్ర వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంచుకోవాలని తెలిపారు పశుగ్రాసం కోసం ఫోడర్ జొన్న లేదా మల్టీకట్ పశుగ్రాస పంటలను సాగు చేయాలని సూచించారు వర్షాలు మెరుగుపడితే స్వల్పకాలిక వరి రకాలు స్వల్పకాలిక పప్పుధాన్యాలను సాగు చేసుకోవచ్చని పైపూత ఎరువులను తేమను బట్టి దశలవారీగా వేయాలని తెలిపారు రైతులు వ్యవసాయ శాఖ అందించే తాజా వాతావరణ సూచనలను నిరంతరం గమనిస్తూ వ్యవసాయ అధికారుల సలహాల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని అధికారులు సూచించారు వర్షాభావ పరిస్థితుల్లో నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు ఈ సమావేశంలో ఎంపీడీవో, హెచ్ఓ, ఏపీవో, డీఈ, ఏఈ, ఏపీఎం, వివిధ గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు,




# ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపిక

**వికారాబాద్ ,జూలై 23, నేటి శుభోదయ :**
జిల్లా స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోసల్ టీమ్‌లకు ఈ రోజు (18-07-2026) సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జోనల్ పోలీసు డ్యూటీ మీట్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోలీసు డ్యూటీ మీట్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ కు ఎంపిక చేయడానికి, జోన్-VI (చార్మినార్) లో కమిషనరేట్స్ మినహా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాకు చెందిన 43-మంది అధికారులు, సిబ్బందికి, డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోసల్ టీంలకు ఈ రోజు జోనల్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించడం జరిగిందనీ, ఈ జోనల్ డ్యూటి మీట్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు మొదటివారంలో మేడ్చల్ లో నిర్వహించే రాష్ట్ర స్థాయి డ్యూటి మీట్ కు ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటి మీట్.. నిర్వహించడం జరుగుతుందని ఈ డ్యూటీ మీట్ నందు సైంటిఫిక్ ఎవిడెన్స్, నేరం జరిగిన తర్వాత నేర స్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి, నేరస్థలం నందు క్లూస్ ఏ విధంగా సేకరించాలి, కంప్యూటర్ పరిజ్ఞానం, మరియు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పని తీరుపై పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నందు సత్తా చాటి, అనంతరం నవంబర్ లో జరిగే నేషనల్ స్థాయి డ్యూటి మీట్ కు అర్హత సాధించాలి అన్నారు. దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్) అనేది పోలీసుల పనితీరుకు అద్దం పట్టే కీలక అంశమని, ఈ డ్యూటీ మీట్ ద్వారా దర్యాప్తులోని మెళకువలను మరింత సమర్థవంతంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి కేసును శాస్త్రీయ పద్ధతిలో, నాణ్యమైన దర్యాప్తుతో ఛేదించినట్లయితే ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డియస్పి సురేందర్ రెడ్డి, ఎ.ఆర్.డియస్పి నరేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్స్ రమేష్, యస్.బి ఇన్స్పెక్టర్స్ సదా నాగరాజు, డ్యూటి మీట్ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# డబ్ల్యూజేఐ దేశంలోనే బలమైన సంఘం




**ఖమ్మం, జులై 23, నేటి శుభోదయ :** రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) సభ్యత్వ నమోదు, రెన్యూవల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నందనం కృపాకర్ పిలుపునిచ్చారు. డబ్ల్యూజేఐ దేశంలోనే బలమైన జర్నలిస్టు సంఘమని, దీని మాతృ సంస్థ బీఎంఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద కార్మిక సంఘమని చెప్పారు. ఈ జర్నలిస్టు సంఘాన్ని రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం వుందన్నారు. తన పర్యటనలో భాగంగా గురువారం ఖమ్మం వచ్చిన కృపాకర్ ను జిల్లా డబ్ల్యూజేఐ నాయకులు నగర శివారులోని 'అనుముల రామిరెడ్డి' ఫంక్షన్ హాల్లో మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ముఖ్యనేతల సమావేశంలో జిల్లాలో ఇప్పటి వరకు యూనియన్ చేపట్టిన కార్యక్రమాలు, జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. అనంతరం కృపాకర్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై డబ్ల్యూజేఐ నిరంతరం పోరాడుతుందన్నారు. అందులో భాగంగానే, జర్నలిస్టుల రైల్వే పాసుల కోసం రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టిందని, పాసులు సాధించేందుకు ముందు ముందు ఈ ప్రయత్నాలకు మరింత పదును పెడతామని చెప్పారు. అలాగే, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఒక కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందిస్తామన్నారు. --- త్వరలో రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ మీటింగ్ : రావికంటి శ్రీనివాస్ సంఘ నిర్మాణం, జర్నలిస్టుల సమస్యలపై విస్తృతంగా చర్చించెందుకు త్వరలో ఒక రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. హైదారాబాద్ లో వున్న ఆయన, ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా యూనియన్ నాయకులతో ఫోన్లో మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు ఏవైనా జిల్లా యూనియన్ నాయకులు సకాలంలో స్పందిస్తూ, కార్యక్రమాలు చేపడుతున్నారని ప్రసంశించారు. ఇదే వరవడిని ముందు ముందు కూడా కొనసాగించి, జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. --- ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి : ఎన్.ఎస్.రావురాష్ట్రంలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్.రావు) ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించి, భవిష్యత్ లో న్యాయ పరమైన చిక్కులు రాకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు గల మార్గాలను అన్వేశించాలని కోరారు. చాలా జిల్లాల్లో అక్రి డేషన్ల జారీ ప్రక్రియ నత్త నడకన సాగుతోందని, ఈ ప్రక్రియను వేగవంతం చేసి, ధరఖాస్తు చేసుకున్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో డబ్ల్యూజేఐ జిల్లా కోకన్వీనర్లు ఎం.ఏ అన్వార్ పాషా, అమరనేని రామకృష్ణ, ఖమ్మం నగర కన్వీనర్, ప్రెస్ క్లబ్ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా ముఖ్యనేతలు మోడిపల్లి కిరణ్, జాబిశెట్టి కుటుంబరావు, ఏనిగండ్ల శ్రీనివాస రావు, బొడ్డుపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడి ఘటనపై సుప్రీంకోర్టు స్పందించాలి



**షాద్ నగర్, జులై 23, నేటి శుభోదయ :**
ఢిల్లీలో విద్యార్థులు శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంపై జరిగిన దాడి ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం వెంటనే స్పందించాలని అడ్వకేట్ నర్సింగ్ డిమాండ్ చేశారు విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై దాడి చేయడం అమానుషమని ఆయన తీవ్రంగా ఖండించారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సమగ్రత ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతింటున్నాయని ఆయన ఆరోపించారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం నుంచి తమకు అనుకూలంగా లేని రాష్ట్ర ప్రభుత్వాలను కుటిల రాజకీయ ఎత్తుగడలతో అస్థిరపరిచే వరకు అనేక అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారుదేశ భవిష్యత్తును నిర్మించే విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సరి కాదని అన్నారు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నిట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు పరీక్షల్లో నెలకొన్న సమస్యలపై పరిష్కారం చూపాలని కోరుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దాడులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు దేశంలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ప్రజల స్వేచ్ఛ హక్కులు పూర్తిగా హరించుకుపోయే ప్రమాదం ఉందని అడ్వకేట్ నర్సింగ్ హెచ్చరించారు మేధావుల మౌనం ప్రమాదకరం అనే నానుడి నిజమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇకనైనా దేశ అత్యున్నత న్యాయస్థానం స్పందించి ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని కోరారు లేనిపక్షంలో దేశ సమగ్రతకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని బీజేపీ అరాచక పాలన సాగిస్తోందని ఆయన విమర్శించారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన భవన నిర్మాణ కార్మిక సంఘం

### -రేవూరికి వినతి పత్రాన్ని ఇచ్చిన కార్మిక సంఘ నాయకులు

**వరంగల్, నేటి శుభోదయ, జులై 23 :** భవన నిర్మాణ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరకాల ఎమ్మెల్యేను సంఘం అధ్యక్షుడు పసుల అన్నస్వామి, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి మహేందర్, కార్మిక సంఘ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి, కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అందుతున్న ఆర్థిక సాయం, బీమా, మరియు పెన్షన్ల వంటి అంశాలపై చర్చించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ని హనుమకొండ భవాని నగర్ లో గురువారం ఆయన నివాసంలో పరకాల పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలభోకే అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు అనంతరం అధికారిక భవన నిర్మాణ రంగాల కార్మికులు మేస్త్రిల లేబర్ల యొక్క సమస్యలపై వినతి పత్రాలను ఎమ్మెల్యే చేతికి సమర్పించడం జరుగుతుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పై మరియు ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులకు సంబంధించిన విషయా పరకాల పట్టణ భవన నిర్మాణ రంగాల కార్మికులు సంఘం నాయకులు చర్చించారు.ఇందులో భాగంగా ఈనెల 26న



భవన నిర్మాణ రంగాల కార్మికులు తలపెట్టిన బంద్ కు సంబంధించిన విషయం పై ఆయనకు వివరించారు,కార్మికుల సమస్యలపై విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అన్నస్వామి తెలిపారు ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ భవన నిర్మాణ రంగాల కార్మికల సంఘం ఉపాధ్యక్షుడు బొచ్చు రమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ వేణుగోపాలచారి,ముంజాల రాజు,ముఖ్య సలహాదారులు వావిలాల పురుషోత్తం,గూడెల్లి పైడి, సహాయ కార్యదర్శి ఇనుగాల సాంబయ్య, మాట్ల సాగర్,కార్యవర్గ సభ్యులు ఏడుకొండలు,సాదుపాని, మాలాద్రి,ఇజ్రాయిల్,రవి తదితరులు పాల్గొన్నారు.

## కాక్రోచ్ జనతా పార్టీ నిరసనపై పోలీసుల దమన కాండను ఖండించండి

**ఖమ్మం, నేటి శుభోదయ, జులై 23 :** జులై 20వ తేదీన కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిర్వహించిన నిరసన ప్రదర్శన పై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఢిల్లీ పోలీసుల దమన కాండను సిపిఐ( ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. గురువారం ఖమ్మం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విచక్షణ రహితంగా విద్యార్థులపై లాఠీచార్జిని భాష్పవాయు ప్రయోగించడం, శాంతియుతంగా తమ డిమాండ్ సాధన కోసం కేంద్ర ప్రభుత్వ జవాబు దారితనాన్ని కోరిన విద్యార్థి సమొహం పై పోలీసులు గుండాల్లాగా విద్యార్థులపై విరుచుకుపడి దాడి చేశారు అని తెలిపారు. తలలు పగలగొట్టారు శరీరాలను ఉనం చేశారు. విద్యార్థులు విద్యార్థినిలు తేడా లేకుండా దాడి చేయడాన్ని దుర్మార్గంగా భావిస్తున్నాము .ఒక విద్యార్థిని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుంది, కొందరు విద్యార్థులు ఇప్పటికీ కనపడకపోవడం ఆందోళన కలిగిస్తుంది. కేంద్ర రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా హక్కును కేంద్ర ప్రభుత్వం కనీస అభిప్రాయం లేకుండా తన ఆధిపత్యం లోకి తీసుకొని దేశవ్యాప్తంగా ఎన్టిఏ ఆధ్వర్యంలో నీట్ పరీక్షను 2017 సంవత్సరంలో ప్రారంభించింది. బలం బలహీన రాష్ట్రాల మధ్య కార్పొరేట్ ప్రభుత్వ విద్యాసంస్థల మధ్య పోటీని నిర్వహించి సామర్థ్యాన్ని నిరూపించుకో మన్నది 2015 నుండి ఇప్పటివరకు ఏడుసార్లు నీట్ పేపర్ కుంభకోణాలకు గురైనది. లక్షలాది విద్యార్థులపై తీవ్ర ప్రభావానికి గురి చేసింది. వందల మంది ఆత్మహత్యలు పురికొల్పింది కేంద్ర కృత నీటి పరీక్ష అవసరం లేదని రాష్ట్ర మాటల్ని కాదని కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. ఈ సంవత్సరం 23 లక్షల మంది విద్యార్థులు చదివి రాసి సేద తీరుతున్న వేళ హఠాత్తుగా నీటు పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థులను దిగ్భ్రాంతికి గురి చేయడమే కాకుండా ఇబ్బందులు పాలు చేసింది. దేశవ్యాప్తంగా 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలు (ప్రభుత్వ హత్యలు) చేసుకున్నారు. ఈ విషయమై నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కించిత్తు పచ్చతాపం లేకుండా వ్యవహరిస్తున్నది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం నుండి కోరుతూ కాక్రోచ్ జత పార్టీ విద్యామంత్రి నరేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ దీక్షకు దిగింది. 20 రోజులుగా సామాజిక కార్యకర్త నిరాహారదీక్షకు పూనుకున్నారు. ప్రభుత్వం చర్చల ద్వారా నిరాహార దీక్షను ఉపసంహరించాల్సింది పోయి దుర్మార్గంగా అరెస్ట్ చేసింది. 20వ తేదీన నిర్వహించిన నిరసన ర్యాలీపై దుర్మార్గంగా దాడి చేసింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని తెలిపారు. ఇప్పటి




కైనా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలి. కేంద్రీకృత నీటి పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి. విద్యార్థులపై అక్రమంగా పెట్టిన కేసులని ఎత్తివేయాలని అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. విద్యార్థులకు ఉద్యమిస్తున్న కాక్రో జనతా పార్టీ ఉద్యమానికి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాం అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగబద్ధంగా వ్యవహ రించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేజీ రామచందర్, కే రమ, కే రంగయ్య, వి కృష్ణ, ఎస్ ఎల్ పద్మ, ఎం అన్వేష్, కే సూర్యం, చిన్న చంద్రన్న, బీ ప్రభాకర్, చంద్ర అరుణ ,గడ్డం సదానందం, గోకినేపల్లి వెంకటేశ్వర రావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు .సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సమావేశం జూలై 21, 22 ,23 తేదీలలో ఖమ్మం పట్టణంలో రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా నేటి వ్యవహారంపై చర్చించి పై తీర్మానం చేశాం. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల రైతాంగ పరిస్థితులపై చర్చించింది వేసిన మెట్ట పంటలు పత్తి తదితర పంటలు ఎండిపోయి రైతుల తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం మాత్రం ఆలస్యంగా మేల్కొని ఇప్పుడు పర్యటనలు చేయటం సమంజసం కాదని స్పష్టం చేస్తున్నావ్ నష్టపోయిన రైతాంగానే విత్తనాల ద్వారా నష్టపరిహారం ద్వారా ఆదుకోవాలని వ్యవసాయ కూలీలకు ప్రత్యేక పరిస్థితులలో ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధి కూలీని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. కాలేశ్వరంలో మేడిగడ్డ నుండి నీటిని ఎత్తిపోయడానికి పంపింగ్ చేర్చని ఇంజనీర్లు పార్టీలో పేర్కొంటున్నాయి ఎల్ఈనో ఏర్పడిన ప్రశ్న తరుణంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థకు ఈ అంశాన్ని రాసి వివరణ తీసుకోవాలని కోరుతున్నాం యుగోలకు బేసిదాలకు పోయి ప్రజల్ని నష్టపరచకూడదని స్పష్టం చేస్తున్నాం అని తెలిపారు.

## బొల్లికుంటలో హై టెన్షన్ వాతావరణం..

### -శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టపై ప్రతిష్టంభన

**వరంగల్, నేటి శుభోదయ, జులై 23 :** వరంగల్ జిల్లా, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన అంశం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో గ్రామంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మిల్స్ కాలనీ పోలీసులు భారీగా మోహరించి శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశారు.

**భూమి పూజ జరిగిన చోటే విగ్రహం ఏర్పాటు చేయాలన్న డిమాండ్:** శివాజీ మహారాజ్ విగ్రహానికి గతంలో భూమి పూజ నిర్వహించిన ప్రదేశంలోనే ప్రతిష్టాపన చేపట్టాలని హిందూ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ముందుగా నిర్ణయించిన స్థలాన్ని మార్చకుండా అదే ప్రాంతంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

**అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటుకు అభ్యంతరం**
మరోవైపు అంబేద్కర్ విగ్రహం సమీపంలో శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్టించడాన్ని అంబేద్కర్ సంఘం, దళిత సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై తమ అభ్యంతరాలను అధికారులకు తెలియజేస్తూ, ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని వారు కోరుతున్నట్లు సమాచారం.




**ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు**
వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామస్థుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకునే దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

**నేడు కీలక సమావేశం:**
ఈ వివాదానికి ముగింపు పలికే లక్ష్యంతో అధికారులు నేడు ఇరువర్గాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో వచ్చే నిర్ణయంపై గ్రామంలో ఆసక్తి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అధికారులు ప్రజలు శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, చట్టాన్ని గౌరవించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం- గ్రామంలో ప్రతి రైతుకు న్యాయం చేస్తాం

### -కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ మంకాల శేఖర్ రెడ్డి.



**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ, జులై 23 :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం రోజున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ని కలిసి ఎలిమినేడు గ్రామంలో ఉన్నటువంటి 512 166 412 సర్వే నెంబర్లలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఎలిమినేడు గ్రామంలో ఉన్నటువంటి సమస్యను వెంబడే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నీ కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ దంపతులకు ఉచిత ఆన్‌లైన్ ఐ వి ఎఫ్ కన్సల్టేషన్ శిబిరం

### -జూలై 28న నిర్వహణ రిజిస్ట్రేషన్లు ప్రారంభం




**తలకొండపల్లి, నేటి శుభోదయ, జులై 23 :** గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు నిపుణులైన ఫెర్టిలిటీ వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఆర్ఎక్స్‌పర్ట్ డిజిటల్ క్లినిక్స్ మామ్ ఐవిఎఫ్ సెంటర్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉచిత ఆన్‌లైన్ ఐవిఎఫ్ కన్సల్టేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ శిబిరంలో గర్భధారణ సమస్యలు ఫెర్టిలిటీ పరీక్షలు, ఐవిఎఫ్ చికిత్సకు సంబంధించిన అంశాలపై ప్రముఖ ఫెర్టిలిటీ నిపుణురాలు డా.పూర్ణిమ దుర్గ ఆమె వైద్య బృందం ఆన్‌లైన్ ద్వారా దంపతులకు సలహాలు అందించనున్నారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఆర్ఎక్స్‌పర్ట్ టెలీమెడిసిన్ వేదిక ద్వారా నిపుణులను నేరుగా సంప్రదించే అవకాశం కల్పించారు.శిబిరానికి రిజిస్ట్రేషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ఆసక్తి గల దంపతులు తమకు సమీపంలోని ఆర్ఎస్పర్ట్ డిజిటల్ క్లినిక్‌లో నమోదు చేసుకోవచ్చని అక్కడ కోఆర్డినేటర్లు పూర్తి వివరాలు అందించి ఆన్‌లైన్ కన్సల్టేషన్‌కు అపాయింట్ మెంట్‌ను ఖరారు చేస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డి.ఆర్. పట్నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దంపతులు దూరం సమయం అధిక వైద్య ఖర్చుల కారణంగా ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించ లేకపోతున్నారని సాంకేతికత ద్వారా నాణ్యమైన ఐ వి ఎఫ్ వైద్య సేవలను వారి వద్దకే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆసక్తి గల దంపతులు వెంటనే నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## జగ్గారెడ్డి - నిర్మల ఆధ్వర్యం లో సంగారెడ్డి లో 1000 మందితో మహా పాదయాత్ర



**సంగారెడ్డి, నేటి శుభోదయ, జులై 23 :** రాహుల్ గాంధీ కి మద్దతుగా నల్ల టీ షర్ట్స్ ధరించి క్లాసిక్ గార్డెన్స్ నుండి గంజి మైదాన్ వరకు పాదయాత్ర నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలుప్లకార్డులు, నినాదాలతో హోరెత్తిన సంగారెడ్డిరాహుల్ గాంధీ కి మద్దతుగా గత మూడు రోజులనుండీ సంగారెడ్డి లో కొనసాగుతున్న ఆందోళనలునీట్ పేపర్ లీకేజీ ఘటన బాధితులపై చర్యలు తీసుకోవాలంటూ... రాహుల్ గాంధీ చేసిన నిరసనలకు మద్దతుగా సంగారెడ్డిలో మూడో రోజు ఆందోళనలు కొనసాగాయి. ప్రజల పక్షాన నిలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం ఆటవికపు చర్య అంటూ సంగారెడ్డిలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ నేతలను నిర్బంధించి... పార్లమెంటులో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆరోపించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు. రాహుల్ గాంధీకి మద్దతుగా పాదయాత్ర చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా... నల్ల టీ షర్ట్లు ధరించి సుమారు 1000 మంది ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణం లోని క్లాసిక్ గార్డెన్స్ నుండి మొదలుకుని గంజి మైదాన్ వరకు 5 కిలో మీటర్ల మేర ర్యాలీ సాగింది. ప్లకార్డులు ప్రదర్శన, నినాదాలతో కార్యకర్తలు నిరసన ను హోరెత్తించారు.

## నందిగామ మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ వీరబాబు




**షాద్నగర్, నేటి శుభోదయ, జులై 23 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం పరిధిలో నందిగామ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా వీరబాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ వీరబాబు మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు కట్టుబడి పనిచేస్తామని, నేరాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏదైనా సమస్యలు లేదా అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వైఫల్యం

### -బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ధ్వజం



**గజ్వేల్, నేటి శుభోదయ, జులై 23 :**
పన్నెండు సంవత్సరాల బీజేపీ పాలనలో దేశంలో పేపర్ లీకేజీలు, నిరుద్యోగ సమస్యలు తీవ్రంగా పెరిగాయని బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, వారికి తాము ఏం చేశామో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తన ఇంటి ముందు గత వారం రోజులుగా ధర్నా జరుగుతున్నా, తనకు తెలియదంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రధాని మోడీ దేశ ప్రజలను ఎలా రక్షిస్తారని వంటేరు ప్రశ్నించారు. ఈ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, దిగజారుతున్న ఆర్థిక పరిస్థితులు, రైతులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రాన్ని గట్టిగా నిలదీశారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా బలహీనపడిందని ఆరోపించారు. కేవలం మత రాజకీయాలను నమ్ముకునే బీజేపీ పాలన సాగుతోందని, దేశ చరిత్రలోనే మోడీ అత్యంత వైఫల్య ప్రధానిగా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు.ఇదే క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ వంటి ఆచరణ సాధ్యంకాని ప్రాజెక్టుల పేరుతో కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో అభివృద్ధిని పక్కనబెట్టి, భారీగా అప్పులు చేస్తూ ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు.

## పుట్టమధు వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు



**మంథని, నేటి శుభోదయ, జులై 23 :**
మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై చేసిన వ్యాఖ్యలను మంథని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయిలి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, శశిభూషణ్ కాచే, సెగ్గం రాజేశం తదితరులు మాట్లాడారు.మంత్రి శ్రీధర్ బాబు ప్రజల ఆదరణతో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా సేవలందిస్తున్నారని, ఆయనతో పాటు దుద్దిళ్ల శ్రీను బాబు ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు.పుట్ట మధుకు రాజకీయంగా అవకాశం కల్పించింది దుద్దిళ్ల కుటుంబమేనని, గతాన్ని మరిచి మంత్రి శ్రీధర్ బాబుపై విమర్శలు చేయడం తగదని అన్నారు. మంథనిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే అధికారులను బెదిరించే రాజకీయాలు మానుకోవాలని పుట్ట మధుకు సూచించారు. మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు, కాంగ్రెస్ కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు

## నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం -డివిజన్ అధ్యక్షులు మంగళరం గోవర్ధన్ రెడ్డి.

**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, జులై 23 :**
నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం మారిందని కాంగ్రెస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు మంగళరం గోవర్దన్ రెడ్డి అన్నారు.గురువారం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై అత్తాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగళరం గోవర్దన్ రెడి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీని అరెస్టు చేసిన దానికి వ్యతిరేకంగా నిరసన నిరసన తెలుపడం జరిగిందన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపిస్తూ,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అత్తాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ప్రజల గొంతును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.ప్రజాస్వామ్య హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ,కాంగ్రెస్ ఎంపీలపై తీసుకున్న చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు.విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని,నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై పారదర్శకమైన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ నాయకులు గొంది ప్రవీణ్ రెడ్డి, కొండకల నాగేందర్రెడ్డి, ఎం.భాస్కర్ గౌడ్, రమాదేవి, విఘ్నేష్, ఖదీర్,



హరినాథ్,భీమ్, అజర్ , గౌష్, ఫారూఖ్, కృష్ణమూర్తి, కన్నా, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులు, డీఏలు విడుదల చేయాలని పెన్షనర్ల డిమాండ్

**ఖమ్మం, నేటి శుభోదయ, జులై 23 :**
ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఖమ్మంలో గురువారం వందలాది మంది పెన్షనర్లు ప్రదర్శన నిర్వహించారు. హెల్త్ కార్డుల జారీ, పే రివిజన్ కమిటీ (పీఆర్సీ) నివేదిక విడుదల, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల చెల్లింపు తదితర అంశాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ప్రదర్శన అనంతరం రోటరీ నగర్‌లోని రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. హెల్త్ కార్డుల జారీలో ఏర్పడిన లోపాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారం రోజుల్లో హెల్త్ కార్డుల జారీకి కృషి చేస్తానని, పీఆర్సీ నివేదిక అమలు, పెండింగ్ డీఏల విడుదల కోసం కూడా ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే పెన్షనర్ల న్యాయమైన హక్కుల కోసం పోరాటంలో ముందుంటానని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకటరెడ్డి మాట్లాడుతూ హెల్త్ కార్డు ట్రస్ట్ బోర్డులో సంఘానికి ప్రాతినిధ్యం




కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2024 మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ ప్రయోజనాలను నెల రోజుల్లో పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరు వేణు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారని, గత ఆరు నెలల కార్యకలాపాల నివేదికను సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం న్యాయస్థానాల ఆదేశాలను అమలు చేయాలని, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలోని వెల్నెస్ సెంటర్‌ను ఆధునికీకరించి పూర్తి స్థాయి వైద్యులను నియమించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలను పరిశీలించిన హైడ్రా అధికారులు.

### -గత 20 సంవత్సరాలుగా గగన్పాడులోని చెరువుల కోసం పోరాటం చేస్తున్న శీలం తిరుపతిరెడ్డి.

**ఖమ్మం, నేటి శుభోదయ, జులై 23 :**
రాబోయే రోజుల్లో గిరిజన హక్కుల రక్షణే ధ్యేయంగా, వారి సమస్యల పరిష్కారం కోసం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర గిరిజన 3వ మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి పాల్తియ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నేలకొండపల్లి మండల పరిధిలోని మంగాపురం తండా గ్రామంలో ఈ నెల 18, 19 తేదీలలో జరగనున్న మహాసభల గోడపత్రిక (పోస్టర్)ను ఆయన గిరిజన నేతలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాల్తియ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల నేటికీ గిరిజన తండాలు కనీస వసతులకు దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల సమస్యలు, అటవీ హక్కుల చట్టం సంపూర్ణ అమలు, గిరిజన విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాల సాధన కోసం ఈ మహాసభల్లో కీలక



తీర్మానాలు చేయనున్నట్లు వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సబ్బండ వర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే ఈ పోరాట మహాసభలకు నేలకొండపల్లి మండల పరిధిలోని గిరిజనులు,



యువకులు, హక్కుల పోరాట యోధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గిరిజన సమైక్య మండల నాయకులు భూక్యా రాములు, గుగులోతు వేంకటేశ్వర్లు, భూక్యా అంజయ్య, భూక్యా వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

## ఫోటో :సభ్యత్వ నమోదు చేస్తున్న విశ్వకర్మ సంఘ సభ్యులు

**సికింద్రాబాద్, నేటి శుభోదయ, జులై 23 :**
18 ఏళ్లకు పైబడిన విశ్వకర్మ యువతీ యువకులు సభ్యత్వం తీసుకోవాలని సికింద్రాబాద్ విశ్వకర్మ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాలపురం ప్రకాష్ గిర్మాపురం భాస్కరాచారి పిలుపునిచ్చారు. సికిం ద్రాబాద్ విశ్వకర్మ సంఘం ముఖ్య సలహాదారు ఆదేశం మేరకు సంఘాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో పంచ కమిటీ అధ్వర్యంలో జనరల్ బజార్లోని ధర్మకాంట, చికోటి కాంప్లెక్స్ వద్ద గురువారం సంఘ సభ్యత నమోదు శిబిరాలను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్ మాట్లాడుతూ... విశ్వకర్మ సంఘం చరిత్ర, సంస్కృతిఇ కాపాడుకోవడానికి, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు అందించడానికి ప్రతి కుటుంబం నుంచి యువత భాగస్వామ్యం కావాలని, సభ్యత్వం ద్వారానే మన హక్కుల సాధన, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలకు బలం చేకూరుతుందన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి భాస్కరాచారుఇ మాట్లాడుతూ... సంఘం అధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధి శిక్షణ, ఆర్థిక సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఎటన్నింటి లబ్ది పొందాలంటే ముందుగా సభ్యులుగా నమోదు కావాలని సూచించారు. యువత ముందుకు వచ్చి సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి, కోశాధికారి బోనాల



శ్రీనివాస్ చారి, భవన చైర్మన్ కార్వాన్ వీరాంజనేయులు, ధర్మకాంట, చైర్మన్ మనోహరాబాద్ శివకుమార్, సంక్షేమ శాఖ చైర్మన్ బౌరంపేట వీరాచారి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రైతుల భూముల రికార్డులు మార్చొద్దు -రామచంద్రరావు





**శామీర్‌పేట, నేటి శుభోదయ, జులై 23 :** శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట గ్రామంలో రైతుల భూముల రికార్డుల మార్పులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గ్రామాన్ని సందర్శించి బాధిత రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వివాదాస్పద భూములను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అధిక సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు కోర్టు 'స్టేటస్ కో' ఉత్తర్వులు ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారులు దళారులతో కుమ్మక్కై ధరణి, భూభారతి పోర్టల్లలో రికార్డులు మార్చడం అన్యాయమన్నారు. కోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోకుండా పట్టాదారుల హక్కులకు భంగం కలిగించడం బాధాకరమని విమర్శించారు.ధరణి, భూభారతి వ్యవస్థల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నత రెవెన్యూ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.23ఎస్ ఎమ్ పి టి 5 బొమ్మరాసిపేటలో సమస్యాత్మకమైన రైతు భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర బిజెపి నాయకులు రామ్ చందర్రావు

## యువతను అడ్డుపెట్టుకొని నీచ రాజకీయాలా!
### -తిరుమణి రాఘవేందర్ గౌడ్

**తలకొండపల్లి, నేటి శుభోదయ, జులై 23 :** దేశంలో యువతను తప్పుదారి పట్టిస్తూ రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు, దేశ విచ్ఛిన్న శక్తులు ప్రయత్నిస్తున్నాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఆరోపించారు. దేశ రాజ్యాంగ వ్యవస్థను,సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు దేశ యువత ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల ఢిల్లీలో జరిగిన పరిణామాలపై స్పందించిన తిరుమణి రాఘవేందర్ గౌడ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంటూ.. నీట్ పరీక్షకు సంబంధించిన సమస్యపై ప్రారంభమైన నిరసన కార్యక్రమాలు పక్కదారి పట్టి ఇతర అంశాల వైపు మళ్లాయని ఆరోపించారు.నిరసనల్లో కొన్ని వివాదాస్పద నినాదాలు,వ్యాఖ్యలు ఎందుకు వచ్చాయో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంటు ముట్టడికి ప్రయత్నించిన ఘటనపై కూడా ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు.యువతను అడ్డుపెట్టుకుని కొందరు స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, రాజకీయ అస్థిరత సృష్టించే ప్రయత్నాలను ప్రజలు, యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.దేశ రాజధానిలో జరిగిన నిరసన కార్యక్రమాలకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. అయితే నిజమైన విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని అన్నారు.దేశంలో రాజకీయ అస్థిరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు విశ్వాసం ఉందని, అందుకే ప్రజలు బీజేపీ, ఎన్డీఏ కూటమికి మరోసారి మద్దతు ఇచ్చారని తిరుమణి రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు.దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నించే శక్తుల ఆటలు త్వరలోనే ముగుస్తాయని అన్నారు. కాంగ్రెస్



పార్టీ తన ఉనికిని కోల్పోతోందని, కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడుతున్నాయని ఆయన విమర్శించారు. దేశ సార్వభౌమాధికారాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశ వ్యతిరేక, విచ్ఛిన్న శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుమణి రాఘవేందర్ గౌడ్ సూచించారు. జై భారత్.. జై హింద్ అని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల గౌరవ అధ్యక్షులుగా కనకమామిడి విష్ణు ముదిరాజ్ నియామకం.

**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, జులై 23 :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్డు సభ్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం గౌరవ అధ్యక్షులు కనకమామిడి విష్ణు తెలిపారు.గురువారంశంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ గ్రామానికి చెందిన వార్డు సభ్యులు కనకమామిడి విష్ణు ముదిరాజ్ ను గురువారం హైదరాబాద్ క్లబ్ హౌస్ లో జరిగిన ఉప సర్పంచ్ ఫోరం అనుబంధంగా తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం ఆవిర్భావ సభ రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం జనరల్ సెక్రెటరీ మట్ట శ్రీనివాస్,రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం ఉప అధ్యక్షులు కవిత,రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్ ఫోరం గౌరవ అధ్యక్షులు రాళ్లబండి శివ కుమార్ గౌడ్,రంగారెడ్డి జిల్లా ఉప సర్పంచ్ ఫోరం ఉప అధ్యక్షులుగా తిరిన రోహిత్ కుమార్,మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులుగా కాగుల



ప్రవీణ్ కుమార్ యాదవ్ లు నియమించబడ్డారు. దీంతో సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన రాష్ట్ర వార్డు సభ్యులు గౌరవ అధ్యక్షులుగా కనకమామిడి విష్ణు ముదిరాజ్,అధ్యక్షులుగా సురేష్,రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా కావేరి వినోద్ లను నియమించడం జరిగింది అన్నారు.

## సీతారాం ప్రాజెక్టుతో రైతులకు ఒరిగేదేమీ లేదు

**ఏన్కూర్, నేటి శుభోదయ, జులై 23 :** రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్న సీతారాం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని రైతులు తీవ్ర ఆవేదన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సౌకర్యాలు మెరుగుపడతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశించిన తమకు చివరికి భూములు కోల్పోవడం తప్ప ఎలాంటి లాభం దక్కలేదని రైతులు వాపోతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం వందలాది ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించింది. తరతరాలుగా వ్యవసాయం చేసి జీవనం సాగించిన రైతులు తమ భూములను ప్రాజెక్టు కోసం అప్పగించినప్పటికీ, నేటికీ ఆ ప్రాజెక్టు ద్వారా తమ పొలాలకు సాగునీరు అందకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని వారు పేర్కొంటున్నారు.కాలువ ద్వారా వచ్చే నీటిని వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గ తదితర ప్రాంతాలకు మళ్లించారని రైతులు ఆరోపిస్తున్నారు. అయితే ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు మాత్రం సాగునీరు అందకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శిస్తున్నారు.భూగర్భ జలాల పెరుగుదల కూడా లేదుకాలువకు ఇరువైపులా పూర్తిగా



సీసీ లైనింగ్ నిర్మించడం వల్ల నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. దీంతో భూగర్భ జలాలు పెరగడం లేదని, బోర్లు, బావుల్లో నీటి మట్టం కూడా మెరుగుపడలేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పశువులకు, గ్రామాలకు కూడా ప్రయోజనం లేదుకాలువలో ప్రవహించే నీటిని పశువులు తాగేందుకు, గ్రామ ప్రజలు అవసరాలకు వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రాజెక్టు తమ ప్రాంతం నుంచి వెళ్తున్నప్పటికీ, దాని ప్రయోజనం తమకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సోమనపల్లిలో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం



**మంథని, నేటి శుభోదయ, జులై 23 :** ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు మంథని నియోజకవర్గంలోని సోమనపల్లి గ్రామం బూత్ నంబర్–131 పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సెగ్గం రాజేశం, గ్రామ సర్పంచ్ గట్టు దామోదర్, సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆయేషా ఫాతిమా, అనిల్ రెడ్డి, బీఎల్ఓ గువ్వల మంజులతో పాటు ఆకాష్, కుమార్, రాజు, మహేష్, సతీష్, రంజిత్, దుర్గయ్య, శ్రీధర్ రాజబాపు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా పూర్తయిందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రభుత్వ అధికారులు నిద్ర మత్తులో..
### ప్లాస్టిక్ మాఫియా దర్జాగ ఉత్పత్తి.



**రాజేంద్రనగర్, నేటి శుభోదయ, జులై 23 :** నిషేధిత ప్లాస్టిక్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నా స్థానిక అధికారులు భారీ మొత్తంలో ముడుపులు అందినట్టు సమాచారం..క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది.చట్టాలు ఒకవైపు... అక్రమ వ్యాపారాలు మరోవైపు అన్నట్టుగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ కవర్ల తయారీ యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపంతో ప్లాస్టిక్ మాఫియా దర్జాగా వ్యాపారం సాగిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని టీఎన్జీఓఎస్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆనుకుని నిషేధిత ప్లాస్టిక్ కవర్ల తయారీ యూనిట్ బహిరంగంగానే నడుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.రోజూ వందల కిలోల ప్లాస్టిక్ కవర్లను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడం భారీ మొత్తంలో ముడుపులు అందుతున్నాయి అన్న అనుమానాలకు తావిస్తోంది.

## ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు... జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**మంథని / పెద్దపల్లి, నేటి శుభోదయ, జులై 23 :** ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించే సమయంలో ఆటంకాలు కల్పించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామ సర్పంచ్ కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీ గంట రమేష్ ప్రభుత్వ అధికారిని విధుల నిర్వహణలో అడ్డుకోవడం, అసభ్యకర, అనుచిత పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడినట్లు సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్, ఎం.బి. ఇంట్రా, పెద్దపల్లి అందజేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(1)(ii), 37(1)(iii) ప్రకారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించగా, అందులో పేర్కొన్న ఆరోపణలు సంబంధిత చట్టంలోని నిబంధనల పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, సంబంధిత సర్పంచ్‌కు కారణం చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.షోకాజ్ నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు లిఖితపూర్వక సంజాయిషీని సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ సమర్పించనట్లయితే, అందుబాటులో ఉన్న రికార్డులు, సాక్ష్యాధారాల ఆధారంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తారని, వారి విధుల నిర్వహణకు ఆటంకం కల్పించడం, బెదిరించడం లేదా అనుచితంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర గౌరవం, సమన్వయంతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**- మండల వ్యవసాయ అధికారి పూజ**



**నేటి శుభోదయ, యాదాద్రి భువనగిరి, జులై 23 :** ప్రస్తుతం ఎల్నీనో ప్రభావం ఎక్కువగా ఉన్నందున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల పైన దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి పూజ రైతులకు సూచించారు. సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామంలో గురువారం ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండటంతో మండలంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షం తక్కువగా కురవడం వల్ల రైతులు కూరగాయల వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు వేసుకోవాలని సూచించారు. కందులు, పెసర్లు, కూరగాయలు, పండ్ల పంటలు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్, వార్డు సభ్యులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి జన్మదిన వేడుకలు



**నేటి శుభోదయ, యాదాద్రి భువనగిరి, జులై 23 :** సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి జన్మదిన వేడుకలు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సర్పంచ్ అభిమానులు కేక్ కట్ చేసి ఆమెకు శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు సూరపల్లి వెంకటేష్, బల్గురి శివ, కట్ల వనజ భాస్కరాచారి, మహమ్మద్ అలీమా యూసుఫ్ ఖాన్, సింగపంగా ప్రశాంతి రమేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరి శీను, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ రమేష్ బాబు, కారోబార్ పున్నం యాదగిరి, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, మారగోని శంకర్ గౌడ్, పల్లె ఆనంద్ గౌడ్, రిపోర్టర్ సింగం కృష్ణ, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి రేవనపల్లి గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కిరణ్ నాయక్, వడ్డేపల్లి శివప్రసాద్, ఈసం శివకుమార్, మందుగుల దానయ్య, వడ్డేపల్లి శివప్రసాద్, బానోత్ గణేష్ పాల్గొన్నారు.

## మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మల్లేష్ యాదవ్ ఎన్నిక



**నేటి శుభోదయ, మహేశ్వరం, జులై 23 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా మల్లేష్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన పై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తూ మండల నాయకులను, ప్రతి కార్యకర్తతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. తనకు బాధ్యత అప్పజెప్పినందుకు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, సీనియర్ నాయకులు కూన యాదయ్య, కర్ణాకర్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, పాండు నాయక్, ఉప్పుగడ్డ తండా సర్పంచి రాజు నాయక్, ప్రవీణ్, గంగారం తండా సర్పంచ్ దేవేందర్ నాయక్, రామచంద్ర, ఉప సర్పంచ్ భాస్కర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు, శివగంగా ఆలయ టెంపుల్ చైర్మన్ అల్లే కుమార్, బాలరాజ్, మండల బీసీ సెల్ అధ్యక్షులు బొల్లు కుమార్, నడికుడ శివ, దుబ్బచెర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ జాబితా సవరణ తప్పనిసరి

**- మణికొండ శివపురి కాలనీ అధ్యక్షుడు మధు**



**రాజేంద్రనగర్, జులై 23, నేటి శుభోదయ :** ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరుగుతున్న విధి విధానాలకు గత కొన్ని రోజులుగా భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ,నెక్నంపుర్ డివిజన్ నాయకుల ప్రయత్నానికి,మద్దత్తుకు మణికొండ శివపురి కాలనీ అద్యక్షుడు మధు,సావిత్రి,హన్మంతు సాగర్,శ్రీనివాస్,తిరుపతి తదితర స్థానిక నివాసులు గురువారం స్థానికులు తమ వద్ద ప్రస్తుతం ఓటర్ కార్డు ఉన్నది కావున తాము మళ్లీ ఈ ఫారమ్ లు నింపవలసిన అవసరం లేదనె అభిప్రాయంతో వుంటిమనీ,అందుకు సంబంధించిన వివరాలను విఫలంగా విడమర్చి చెబుతూ ఇట్టి ప్రక్రియలో బూతులెవల్ అధికారుల పాత్ర ఎంత కీలకమో–ప్రజల పాత్ర కూడా అంతే కీలకం అని,ప్రతి క్రియగా నివాసిత కుటుంబ సభ్యులు,ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటును 2002 లోని తమ ఓటు లేదా తమ పెద్దల ఓటుతో జత కలుపడం (మ్యాపింగ్ చేయడం) తప్పని సరి అని అప్పుడే తమ ఓటు హక్కు ఉంటుందని లేనిచో ఓటు గల్లంతగునని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు వివరించారు.ఈ నేపథ్యంలో ఫారమ్ లు పొందలేక అసంతృప్తితో ఉన్న స్థానిక ఓటర్లకు తమ ఓటు కలిగి ఉన్న పోలింగ్ కేంద్రాల బి.ఎల్.ఒల మొబైల్ నెంబర్ తెలియచేసి,వారికి బూతులెవల్ అధికారుల వద్ద నుండి ఎన్యుమరేషన్ ఫారమ్లు పొందడానికి,తదనంతరం ఆధార్ కార్డు వివరాలు పొందు పరుస్తు,2002లో వారి ఓటు లేదా కుటుంబ పెద్దల ఓటు వేసిన నియోజకవర్గము,పోలింగ్ కేంద్రము,ఓటర్ సీరియల్ నెంబర్ లు సేకరించడం ద్వారా ఫారమ్ పూరించడానికి బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గుట్టమీది నరేందర్,అందే లక్ష్మణ్ రావు,సంగం శ్రీకాంత్,సుమనళిని,దేవి ప్రియ,షేక్ ఆరిఫ్,భాను చందర్,శ్రీధర్,బిందు,శివ తదితరులు సంపూర్ణ సహకారాన్ని అందించారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నేతలతో సమీక్షా సమావేశం





**శేరిలింగంపల్లి, జులై 23,నేటి శుభోదయ :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.మియాపూర్ డివిజన్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ , శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ లు హాజరై సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో పార్టీ శ్రేణుల బాధ్యతపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో సర్ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతి ఇంటికి చేరుకుని ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా పరిశీలించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటరు నమోదు వివరాలు సరైనవిగా, తాజాగానూ ఉన్నాయో లేదో నిర్ధారించాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల సేకరణ నుంచి వాటి ఆన్‌లైన్ నమోదు వరకు ప్రతి దశను జాగ్రత్తగా పర్యవేక్షించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ప్రతి అర్హత కలిగిన పౌరుడు ప్రక్రియలో భాగస్వామ్యమై, తన పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజలతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మియాపూర్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు, క్రీడాకారులకు ప్రోత్సాహం



**షాబాద్, జులై 23, నేటి శుభోదయ :**

పేద విద్యార్థులకు, అలాగే గ్రామీణ క్రీడాకారులకు అన్ని విధాలుగా తోడ్పాటు నందించి ప్రోత్సహిస్తామని షాబాద్ మాజీ జెడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి అన్నారు.శుక్రవారం కేటీఆర్ జన్మదిన సందర్భంగా మండల పరిధిలోని వారి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గిఫ్ట్ ఏ స్మైల్ లో భాగం గా మండలంలోని క్రీడాకారుల కొరకు ప్రతి గ్రామానికి ఒక క్రికెట్ కిట్ అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు లాప్టాప్ లు అందజేయన్నట్లు తెలిపారు. ప్రస్తుతము 35 గ్రామాలకు చెందిన విద్యార్థుల కొరకు ఆయా గ్రామాలను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. మిగతా గ్రామాల విద్యార్థులకు రెండవ విడతలో లాప్టాప్ లు అందజేస్తామని అన్నారు.ఈ బహుమతులను రెండు, మూడు రోజుల్లో ఆయా గ్రామాల సర్పంచుల చేతులమీదుగా అందజేస్తామని హామీ ఇచ్చారు. కేటీఆర్ జన్మదినం గుర్తుగా వీటిని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ రావు, నక్క శ్రీనివాస్ గౌడ్, ముదేంగూడ సర్పంచ్ నర్సింలు, కేశవ గూడ సర్పంచ్ ఒగ్గు రాజు, మాజీ సర్పంచులు పాండురంగా రెడ్డి, గోపాల్ రెడ్డి, నాయకులు కృష్ణ, రాందేవ్, రాజేందర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

**- గోలి శ్రీనివాస్ రెడ్డి**



**నేటి శుభోదయ, కల్వకుర్తి, జులై 23 :** కల్వకుర్తి నియోజకవర్గం లోనీ పొతేపల్లి, యంగం పల్లి, జిల్లెల, మార్చర్ల గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ)లకు పలు సూచనలు చేశారు. మరో పది రోజుల్లో ఓటరు జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇతర అభ్యర్థనలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైతే మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రసిడెంట్లు, మాజీ ఎంపీపీ లు, తాజా మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, తాజా మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620